

# మంచిపేరు తీసుకురండి

- పాఠశాల, సొంతూరి అభివృద్ధికి పాటుపడాలి
- విద్యార్థులు, తల్లిదండ్రులకు మంత్రి బీసీ పిలుపు
- ఇల్లూరు కొత్తపేట పాఠశాలలో మెగా పీటీఎం

బనగానపల్లె, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): చదివిన పాఠశాలకు, జన్మించిన సొంతూరికి మంచిపేరు తీసుకురావాలని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి పిలుపునిచ్చారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అందరూ కలిసేందుకు మెగా పేరెంట్స్ టీచర్స్ మీట్ గొప్ప వేదికగా నిలిచిందన్నారు. శనివారం బనగానపల్లె మండలంలోని ఇల్లూరు కొత్తపేట జడ్పీ ఉన్నతపాఠశాలలో మెగా పేరెంట్స్ టీచర్స్ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి మంత్రి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, పూర్వ విద్యార్థులు అందరూ ఒకేచోట సమావేశం కావడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఈ సమావేశం ద్వారా పాఠశాలల్లో సమస్యలు తెలుస్తాయని, పిల్లలు ఎలా చదువుతున్నారో తల్లిదండ్రులకు తెలుస్తుందన్నారు. గాడి తప్పిన విద్యావ్యవస్థను అభివృద్ధి దశలో పెట్టేందుకు రాష్ట విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ మెగా పేరెంట్స్ టీచర్స్ మీట్‌కు శ్రీకారం చుట్టారన్నారు. తల్లిదండ్రులు, విద్యార్థులకు ఎప్పటికప్పుడు సలహాలు, సూచనలు ఇస్తూ వారి ఆలోచనలకు అనుగుణంగా ప్రోత్సహించాలని సూచించారు. తల్లిదండ్రులు వారి పిల్లల గురించి ఏదైనా సమస్య ఉంటే ఉపాధ్యాయుల దృష్టికి తీసుకురావాలన్నారు. పాఠశాలల్లో విద్యార్థుల ప్రోగ్రెస్ రిపోర్టు, వారి ఆరోగ్యం గురించి ఉపాధ్యాయులతో చర్చించాలన్నారు. సైబర్ నేరాలు, సామాజిక మాధ్యమాలు, మాదక ద్రవ్యాలపై పూర్తి స్థాయిలో అవగాహన పెంచుకోవాలన్నారు. తల్లిదండ్రులు, పాఠశాలకు మెరుగైన సౌకర్యాలు కల్పించి బంగారు భవితకు పునాది వేయాలన్నదే తమ ప్రభుత్వ ధ్యేయమన్నారు. అనంతరం విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో మంత్రి ముఖాముఖి నిర్వహించారు. వారితో మాట్లాడి సమస్యలను తెలుసుకుని పరిష్కరించేలా విద్యాశాఖ అధికారులను చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు రూ.21 వేలు నగదు ప్రోత్సాహక బహుమతులు మంత్రి అందించారు. ప్లాస్టిక్ రహిత సమాజం కోసం 'నా బనగానపల్లె- నా ఆరోగ్యం' పేరుతో బీసీ ఇందిరమ్మ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించినందుకు అభినందించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం సోమశేఖర్‌రెడ్డి, ఉపాధ్యాయులు కుమార్‌బాబు, రామచంద్రారెడ్డి, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులతో నవ్వుతూ సరదాగా మాట్లాడుతున్న మంత్రి బీసీ



విద్యార్థులు, ఉపాధ్యాయులతో మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి

## మంత్రి ఫరూక్ భావోద్వేగం



ప్రసంగిస్తున్న మంత్రి ఫరూక్

నంద్యాల, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): నంద్యాల పట్టణంలోని కాదరబాద్ నరసింగరావు మెమోరియల్ మున్సిపల్ పాఠశాలలో శనివారం జరిగిన మెగా పీటీఎం సమావేశంలో రాష్ట్ర న్యాయ, మైనార్టీ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ భావోద్వేగానికి గురయ్యారు. చదివిన పాఠశాల కావడంతో మంత్రి చిన్ననాటి స్నేహితులతో కలసి మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశానికి హాజరయ్యారు. పాఠశాల పూర్వ విద్యార్థులు డాక్టర్ గెలివి సహదేవుడు, వెంకటేశ్వర్లు, మిద్దె హుసేని తదితరులతో కలిసి పాఠశాల ఆవరణలో మంత్రి కలియతిరిగారు. పాఠశాలలో తనకు విద్యాబుద్ధులు నేర్పించిన ప్రధానోపాధ్యాయుల చిత్రపటాలను తదేకంగా చూస్తూ ఉద్వేగానికి గురయ్యారు. మంత్రికి విద్యార్హత పత్రాలను, పాఠశాలతో ఆయనకు ఉన్న సంబంధంతో ఉన్న చిత్రాలతో కూడిన ప్రదర్శనను పాఠశాల యాజమాన్యం ఏర్పాటు చేశారు. ప్రదర్శనను తదేకంగా చూస్తూ తన తీపి గుర్తులను ప్రస్తుత ఉపాధ్యాయ బృందం, విద్యార్థుల తల్లిదండ్రులతో పంచుకున్నారు. చిన్నప్పుడు చేసిన అల్లరి, తాను కూర్చొని చదివిన తరగతి గదులు, అప్పటి రికార్డులను మంత్రి పరిశీలించారు. స్నేహితులతో సరదాగా గడిపారు.

### 'దేశ భవిష్యత్‌కు పాఠశాలలు పునాదులు'

దేశ భవిష్యత్‌కు పునాది, నవ సమాజ స్థాపన పాఠశాల నుంచే ప్రారంభమవుతుందని మంత్రి ఎన్ఎండీ ఫరూక్ అన్నారు. కాదరబాద్ నరసింగరావు మెమోరియల్ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో జరిగిన మెగా పీటీఎం సమావేశంలో మంత్రి ప్రసంగించారు. విద్య ప్రతి ఒక్కరి జీవితంలో ముఖ్యమైన అంశమని అలాంటి విద్యను పూర్తిస్థాయి వసతులతో ప్రతి ఒక్కరికీ సంపూర్ణంగా అందించడమే సీఎం చంద్రబాబునాయుడు లక్ష్యమన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యావ్యవస్థలో నూతన సంస్కరణలను ప్రభుత్వం తీసుకువస్తోందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నిరంజన్‌రెడ్డి, టీడీపీ పట్టణ అధ్యక్షుడు మణియార్ ఖలీల్, పాఠశాల హెచ్ఎం అసదుల్లా, ఉపాధ్యాయ బృందం, పూర్వ విద్యార్థులు, పాఠశాల కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



# కమీషన్ల హానీ..!

- స్వయం సహాయక సంఘాల సర్వేలో నయా దందా
- ఒక్కో సంఘం నుంచి రూ.వెయ్యికి పైగా వసూలు?
- సంఘాల ఆర్పీలపై ఆరోపణల వెల్లువ

నంద్యాల, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మహిళలు ఆర్థికంగా స్థిరపడేందుకు స్వయం సహాయక సంఘాలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. స్వయం ఉపాధి కోసం ఆయా సంఘాలకు రుణాలు అందిస్తూ ప్రోత్సహిస్తోంది. ఇలాంటి గ్రూపుల్లోని సభ్యుల ఆర్థిక పరిస్థితి అనుకున్న స్థాయిలో మెరుగుపడిందా? లేదా? అనే వివరాలను సేకరించడంతో పాటు గ్రూపుల పరిధిలోనికి రాని మహిళలను గ్రూపులుగా తయారు చేసి వారికి కూడా ఆర్థిక భరోసా కల్పించేందుకు కూటమి ప్రభుత్వం సంకల్పించింది. ఇందులో భాగంగా సంఘాలపై సర్వే చేపట్టింది. దీనిని అదనుగా తీసుకుని కొందరు ఆర్పీ(రిసోర్స్ పర్సన్)లు చేతి వాటాన్ని ప్రదర్శిస్తున్నారు. గ్రూపులో సభ్యులను బట్టి డబ్బులు వసూలు చేస్తున్నారు. నంద్యాల పట్టణ పరిధిలో ఉన్న గ్రూపుల నుంచి భారీ మొత్తంలో ఆర్పీలు డబ్బులు వసూలు చేశారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ విషయంపై అధికారులకు ఫిర్యాదులు కూడా వెల్లువెత్తాయి. అయినా ఆర్పీలు ఏమాత్రం పట్టించుకోకుండా డబ్బులు దండుకోవడాన్ని ఆపడం లేదని సమాచారం.

నంద్యాల పట్టణ వ్యాప్తంగా 41వేలకు పైగా మహిళా సంఘాల సభ్యులు ఉన్నారు. వీరందరికీ 138 మంది ఆర్పీలు స్వచ్ఛందంగా సేవలు అందిస్తున్నారు. ఇప్పటికే ఆర్పీలు 3,465 సంఘాలకు సంబంధించిన 29,156 మంది సభ్యుల వివరాలను సర్వే చేశారు. ఇంకా 737 సంఘాలకు సంబంధించిన 12,690 మంది సభ్యుల వివరాలను సేకరించాల్సి ఉంది. ఈ లెక్కన ఇప్పటికే సర్వే చేసిన ఆయా సంఘాల సభ్యుల నుంచి వసూలు చేసిన మొత్తం భారీగానే ఉందని అంచనా! చూడ్డానికి ఒక్కొక్కరి నుంచి రూ.100 అనిపించినా, 29 వేల మందికి సంబంధించిన మొత్తం రూ.29 లక్షలు

### భారీగానే దండుకున్నారా..?

వసూలైనట్లు పలువురు మహిళలు ఆరోపిస్తున్నారు. ఆర్పీలు ఇలా వసూలు చేస్తున్నారని విషయాన్ని కొన్ని ప్రాంతాలకు సంబంధించిన గ్రూపు సభ్యులు సంబంధిత అధికారులకు ఫిర్యాదులు చేశారు. విషయం తెలుసుకున్న అధికారులు ఆయా సంఘాలతో సమావేశాలు నిర్వహించి ఎవరూ డబ్బులు అడిగినా ఇవ్వవద్దని అవగాహన కల్పిస్తున్నారు. అయినా ఆర్పీల వసూలు పర్వం మాత్రం ఆగడం లేదని తెలుస్తోంది. ఇంత భారీ మొత్తంలో వసూలు చేసిన డబ్బులను కేవలం ఆర్పీలు మాత్రమే తమ ఖాతాల్లో వేసుకుంటున్నారా? లేక వారి పై వారికి కూడా ఇందులో వాటా ఉందా? అనే ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి.

### డబ్బులు ఎవరికీ ఇవ్వవద్దు

స్వయం సహాయక సంఘాలకు సంబంధించిన సర్వేలో ఆర్పీలు డబ్బులు వసూలు చేస్తున్నారన్న విషయం మా దృష్టికి వచ్చింది. అలాంటి చోట్ల ఆయా సంఘాలతో సమావేశం నిర్వహించి డబ్బులు ఎవరికీ ఇవ్వవద్దని గట్టిగా సూచించాం. ఇంకా ఎక్కడైనా డబ్బులు వసూలు చేస్తుంటే మాకు ఫిర్యాదు చేయండి. అలా చేసే ఆర్పీలపై చర్యలు తీసుకుంటాం.
- మురళి, సీఎంఎం, మెప్మా, నంద్యాల



మెప్మా కార్యాలయం

### నంద్యాలలో నాలుగు వేల గ్రూపులు

జిల్లా వ్యాప్తంగా వేల సంఖ్యలో స్వయం సహాయక సంఘాలు ఉన్నాయి. గ్రామాల పరిధిలోని సంఘాలు డీఆర్‌డీఏ పరిధిలోకి రాగా, పట్టణ పరిధిలోని సంఘాలు మెప్మా పరిధిలోనికి వస్తాయి. నంద్యాల పట్టణ పరిధిలో 4,208 స్వయం సహాయక సంఘాలు ఉండగా, ఇందులో 41,846 సభ్యులు ఉన్నారు. ఒక్కో గ్రూపులో 10 మంది సభ్యులు ఉంటారు. ఇక పట్టణంలోని ఈ సంఘాలకు సంబంధించి దాదాపు రూ.50 కోట్ల డిపాజిట్లు ఉన్నాయని అంచనా! వీటి ఆధారంగా ఆయా సంఘాలకు మెప్మా ద్వారా బ్యాంకర్లు రుణాలను కల్పిస్తాయి. రుణాలు తీసుకునే సమయంలో సంఘంలోని సభ్యులు స్వయం ఉపాధి పొందేందుకు చిరు వ్యాపారం ఏదైనా పెట్టుకుంటున్నారా? లేక దుర్వినియోగం చేస్తున్నారా? అనే విషయం తెలియజేయాల్సి ఉంటుంది. దీనివల్ల సంఘంలోని సభ్యులు తీసుకున్న రుణాన్ని తిరిగి చెల్లించగులుగుతారా? లేదా? అనే విషయం ఆధారంగా రుణం మంజూరవుతుంది. ఇక ఈ గ్రూపుల ద్వారా ప్రతి నెలా సరిగా లోను కట్టేలా ఆర్పీలు చూస్తుంటారు. ఒక్కో ఆర్పీ కింద దాదాపు 25 గ్రూపులు ఉంటాయి. ఈ ఆర్పీలంతా స్వచ్ఛందంగా గ్రూపుల్లోని సభ్యులకు సాయపడుతుంటారు. దీనికి గాను మెప్మా ద్వారా ఆర్పీలకు నెలకు రూ.8 వేలు గౌరవ వేతనంగా అందుతుంది. వెరసి ఆయా సంఘాల పనులను ఆర్పీలు చక్కబెడుతుంటారు. దీనివల్ల ఆయా గ్రూపుల మీద ఆర్పీల పెత్తనం నడుస్తుంటుంది.

### అవకాశంగా తీసుకుని..

రుణం తీసుకున్న డబ్బుతో మహిళలు ఆర్థికంగా బలపడతారన్నది ప్రభుత్వ ఉద్దేశం. కానీ ఆయా గ్రూపుల్లోని మహిళలు ఉపాధి అవకాశాల కోసం కాకుండా ఇంటి అవసరాల కోసం లోను తీసుకుంటుంటారు. వడ్డీ తక్కువ కావడం, నెలకు కంతుల వారీగా చెల్లించే అవకాశం ఉండటంతో ఈ విధంగా చేస్తుంటారు. ప్రస్తుతం ఆయా గ్రూపుల సమాచారాన్ని కూటమి ప్రభుత్వం సర్వే ద్వారా సేకరించనుంది. సంఘం అకౌంట్ నెంబరు, సంఘంలోని సభ్యులు, వారి కుటుంబ వివరాలు, స్థితిగతులను ఆర్పీలు సేకరించి మొబైల్ యాప్‌లో నిక్షిప్తం చేస్తారు. ఈ సమాచారాన్ని కమ్యూనిటీ ఆర్గనైజర్, సిటీ మిషన్ మేనేజర్ (సీఎంఎం) టెక్నికల్ ఎక్స్‌పర్ట్, పీడీ, ఎండీ (మిషన్ డైరెక్టర్) చేరుతుంది. ఈ సర్వే ద్వారా ఈ సంఘాల్లోని సభ్యులు తీసుకున్న లోను స్వయం ఉపాధికి ఉపయోగించుకోవటం లేదనే సంగతి తెలిసిపోతుందని ఆందోళన చెందుతున్నారు. వాస్తవానికి ఈ సర్వే కొత్త గ్రూపుల ఏర్పాటు కోసమే! కానీ ఆయా సంఘాల్లోని సభ్యులు అనవసర భయాన్ని ఆసరాగా తీసుకున్న ఆర్పీలు డబ్బులు గుంజుకుంటున్నారు. సంఘంలోని సభ్యుల సంఖ్యను బట్టి రూ.వెయ్యి నుంచి రూ.1500 వరకు వసూలు చేస్తున్నారని తెలుస్తోంది.

## వీర జవానుల సేవలు మరువలేం

కలెక్టర్ రాజకుమారి



విరాళాల కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్, జేసీ

నంద్యాల కల్చరల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): త్రివిధ సాయుధ దళాల సేవలు దేశ రక్షణకు కీలకమని, వీర జవానుల సేవలు మరువలేనివని కలెక్టర్ రాజకుమారి అన్నారు. శనివారం కలెక్టర్ చాంబర్‌లో సాయుధ దళాల పతాక దినోత్సవాన్ని పురస్కరించుకొని కలెక్టర్ రాజకుమారి, జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్ తమ వంతు విరాళాలనిచ్చి కార్యక్రమాన్ని ప్రారంభించారు. మాజీ సైనికుల సంక్షేమార్థం ఏర్పాటు చేసిన ప్రత్యేక నిధికి విరాళాలు అందించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సైనిక సంక్షేమ అధి కారి రత్నారూత్, సూపరింటెండెంట్ మహేంద్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

## కర్నూలులో ఈగల్ చీఫ్

కర్నూలు క్రైం, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఈగల్ చీఫ్, ఐజీ ఆకే రవికృష్ణ శనివారం కర్నూలుకు వచ్చారు. దేవనకొండ మండలంలోని కప్పట్రాళ్ల పర్యటనలో భాగంగా ఆయన స్థానిక పోలీసు అతిథి గృహానికి చేరుకున్నారు. కర్నూలు వచ్చిన ఈయనను డీఐజీ కోయ ప్రవీణ్, ఎస్పీ బిందుమాధవ్, కర్నూలు డీఎస్పీ బాబు ప్రసాద్, నగరంలోని పలువురు సీఐలు మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లాలో ఈగల్ ఎస్టాబ్లిష్‌మెంట్‌పై, డ్రగ్స్ కంట్రోలింగ్ తదితర అంశాలపై ఎస్పీ బిందుమాధవ్‌తో ఐజీ చర్చించారు. త్వరలోనే కర్నూలులో ఈగల్ టీమ్‌ను ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఐజీని కలిసిన వారిలో సీఐలు శ్రీధర్, మురళిధర్ రెడ్డి, శేషయ్య, మన్సూరుద్దీన్, ప్రసాద్ తదితరులు ఉన్నారు.



ఐజీకి జ్ఞాపికను అందజేస్తున్న ఎస్‌బీ సీఐ ప్రసాద్

## 56 వేల క్వింటాళ్ల పత్తి కొనుగోలు

మార్కెట్ యార్డ్ కార్యదర్శి రామ్మోహన్ రెడ్డి



ఆదోని అగ్రికల్చర్, డిసెంబరు7 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధరతో కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఇప్పటి వరకు ఆదోని వ్యవసాయ మార్కెట్ పరిధిలో 56,273 క్వింటాళ్ల పత్తి కొనుగోలు చేసిందని మార్కెట్ యార్డ్ కార్యదర్శి రామ్మోహన్ రెడ్డి తెలిపారు. శనివారం తన చాంబర్లో ఆయన సీసీఐ కొనుగోలుపై మాట్లాడుతూ ప్రస్తుతం అంతర్జాతీయ మార్కెట్‌లో పత్తి గింజల ధరలు తక్కువగా ఉన్నందు వల్ల స్థానిక మార్కెట్‌లో వ్యాపారులు పత్తిని కనీస మద్దతు ధర కంటే తక్కువకు కొంటున్నారని, రైతులు తక్కువ ధరకు అమ్ముకొని నష్టపోవద్దని అన్నారు. కేంద్రం ప్రకటించిన కనీస మద్దతు ధర రూ.7521కు సీసీఐ కేంద్రాల్లో విక్రయించుకోవాలని సూచించారు. గత 15రోజుల నుంచి 2,523 మంది రైతుల నుంచి సీసీఐ పత్తి కొనుగోలు చేసిందన్నారు. పత్తి కొన్న వారం రోజుల్లోనే సీసీఐ నేరుగా రైతుల ఖాతాలో డబ్బు జమ చేస్తున్నదని అన్నారు. రైతు సేవా కేంద్రాలలో రైతులు తమ పేర్లను నమోదు చేసుకోవాలని, ఈ మేరకు నిబంధనలు సడలించినట్లు ఆయన తెలిపారు.

## నేడు జడ్పీ సర్వసభ్య సమావేశం

కర్నూలు న్యూసిటీ, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కర్నూలు జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం ఆదివారం నిర్వహించనున్నట్లు జిల్లా పరిషత్ సీఈవో జి. నాసరరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా పరిషత్ సమావేశభవనంలో ఉదయం 11 గంటలకు చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి అధ్యక్షతన జరిగే సమావేశానికి మంత్రులు, ఉమ్మడి జిల్లాల కలెక్టర్లు, అధికారులు, ఎంపీలు, శాసనసభ్యులు హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. గ్రామీణ నీటి సరఫరా, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖ, విద్యుత్ శాఖలపై చర్చ ఉంటుందన్నారు. అదేవిధంగా ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు 1,2వ స్థాయీ సంఘాల సమావేశాలు మినీ సమావేశ భవనంలో నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. సమావేశానికి ఉమ్మడి జిల్లాల జడ్పీటీసీలు, ఎంపీపీలు హాజరవుతున్నట్లు ఆయన తెలిపారు.

## జాతీయ స్థాయి సైక్లింగ్ పోటీలకు ప్యాపిలి విద్యార్థిని

కర్నూలు స్పోర్ట్స్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి సైక్లింగ్ పోటీలకు ప్యాపిలి మండలంలోని జడ్పీహెచ్ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న ఎం.వెంకటేశ్వరి ఎంపికైంది. నవంబరు 30న గుంటూరు జిల్లాలో జరిగిన అంతర్‌జిల్లా సైక్లింగ్ ఎంపిక పోటీల్లో వెంకటేశ్వరి ఉత్తమ ప్రతిభ కనపరిచింది. దీంతో 9, 10 తేదీల్లో ఒడిశాలో జరిగే జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయురాలు జి.విజయలక్ష్మి, కోచ్ బి.జయగణపతి తెలిపారు.



సైక్లింగ్‌లో ప్యాపిలి జడ్పీహెచ్ఎస్ విద్యార్థిని వెంకటేశ్వరి

కూటమి ప్రభుత్వంతోనే రైతులకు న్యాయం
ఎమ్మెల్యే బుడ్డా 7లో

పిల్లల చదువుపై శ్రద్ధ వహించాలి
కలెక్టర్ రాజకుమారి 6లో

13వరకు బీఈడీ స్పాట్ అడ్మిషన్లు
జడ్పీలో కారుణ్య నియామకాలు
వివరాలు 6లో


# 133 ఏళ్ల ఎస్పీజీ చర్చి

● నేటికీ చెక్కు చెదరని నిర్మాణం ●నంద్యాల జిల్లాలోనే తొలి చర్చి



రెండీ షెప్పర్డ్ దొర సమాధి


**చాగలమర్రి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి):** ఎందరో విశ్వాసులకు ప్రార్థన నిలయంగాను, ప్రార్థించిన విశ్వాసుల హృదయాలకు శాంతి, కరుణ, జాలి అందించే కేంద్రంగా బాసిల్లుతోంది చాగలమర్రి మండలంలోని ముత్యాలపాడు ఎస్పీజీ చర్చి. పురాతనమైన చర్చిగా పేరొందిన ప్రార్థనా మందిరం ఆదివారంతో 133 ఏళ్ల పూర్తి చేసుకుంటోంది. అత్యంత సుందరంగా నిర్మించిన ఈ చర్చి నేటికీ చెక్కు చెదరని కట్టడంగా చరిత్రలో నిలిచిపోయింది. 133 వసంతాలు పూర్తి చేసుకున్న ఎస్పీజీ చర్చిలో ఆది, సోమవారాల్లో వార్షికోత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఎస్పీజీ సంఘ స్థాపనకు ముత్యాలపాడు గ్రామం పునాది. జిల్లాలోనే మొదటగా ఇక్కడ చర్చి నిర్మించి సువార్త సేవను ప్రారంభించారు. 1852వ సంవత్సరంలో ఆల్‌ఫ్రెడ్‌డిడ్ ఈ ప్రాంతానికి ప్రథమ మిషనరీగా వచ్చి 30 మందికి బాప్తిజం ఇచ్చినట్లు చరిత్ర చెబుతుంది. అదే సంవత్సరంలో రెవరెండ్ జాన్‌క్లె దొర రెండో మిషనరీగా వచ్చి 1852లో ఒక బావి తవ్వించారు. సువార్త సేవ చేస్తూనే భార్య, కుమారుడిని ఆయన కోల్పోయారు. 1855లో రాయలసీమలోనే మొదటగా చర్చి నిర్వహణలో ప్రాథమిక పాఠశాల, వైద్యశాల నిర్మించారు. ఇంగ్లాండ్ దేశానికి చెందిన రెవడెండ్ ఫర్ దొర 1877 నవంబర్‌లో ముత్యాలపాడుకు వచ్చి దేవుడి సేవ ప్రారంభించారు. 1984లో మద్రాసు అధ్యక్ష బిషప్ రైట్ రెవ ఫెడరిక్‌బెల్ ద్వారా చర్చి నిర్మాణానికి పునాది రాయి వేశారు. ముత్యాలపాడు నుంచే రెండీ షెప్పర్డ్‌దొర కర్నూలు-కడప జిల్లాలో సువార్త సేవ వ్యాప్తి చేశారు. ఆయన నివాస భవనంగా నిర్మించుకున్న బంగ్లా నేడు ఎస్పీజీ ఉన్నత విద్యాలయ భవనంగా మారింది. 1912 సంవత్సరంలో ఆయన కన్నుమూశారు. నేటికీ ముత్యాలపాడు చర్చి ఆవరణలో ఆయన సమాధికి ప్రార్థనలు జరుగుతూనే ఉన్నాయి.




చర్చికి పునాది వేసిన ఇంగ్లండ్ దేశీయుడు రెండీ షెప్పర్డ్ దొర చిత్రపటం

### రెండు రోజుల పాటు చర్చి వార్షికోత్సవం

133 ఏళ్ల వసంతాలు పూర్తి చేసుకున్న ఎస్పీజీ చర్చిలో 8, 9 తేదీల్లో రెండు రోజుల పాటు వార్షికోత్సవాలు నిర్వహిస్తున్నట్లు డీనరీ ఛైర్మన్ సంజీవరాజ్ తెలిపారు. ఎంతో చరిత్ర కలిగిన ఎస్పీజీ చర్చి వార్షికోత్సవం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. 8న చర్చిలో ప్రభు సంస్కారపు ఆరాధన, కర్నూలుకు చెందిన ప్రసన్నకుమార్‌బాబుచే దీపారాధన, 9న నంద్యాల ఎస్పీజీ డయాసిస్ వైస్ ప్రెసిడెంట్ వరప్రసాద్‌రావు ఆధ్వర్యంలో ఊరేగింపు, చర్చి ప్రతిష్ఠ ఆరాధన జరుగుతుందని తెలిపారు.



133 ఏళ్ల చరిత్రగల ముత్యాలపాడు ఎస్పీజీ చర్చి

## మంత్రాలయంలో అండర్ డ్రైనేజీ వ్యవస్థ

● ఉచితంగా నిర్మించేందుకు ముందుకు వచ్చిన టాటా కంపెనీ
● భూమి పూజ చేసి పనులను ప్రారంభించిన పీఠాధిపతి



అండర్ డ్రైనేజీ నిర్మాణానికి ప్రణాళికను పరిశీలిస్తున్న పీఠాధిపతి

**మంత్రాలయం, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి):** మంత్రాలయంలో అండర్ డ్రైనేజీ వ్యవస్థ నిర్మాణానికి ప్రముఖ టాటా కంపెనీ ముందుకు వచ్చింది. శనివారం టాటా కంపెనీ అధికార ప్రతినిధి చంద్రశేఖర్, ప్రణాళిక ఇంజనీర్ రంగనాథ్ ఆధ్వర్యంలో పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా పీఠాధిపతి మాట్లాడుతూ శ్రీమఠంతో పాటు మంత్రాలయంలో ప్రధాన కాలనీలను కలుపుతూ దాదాపు 2 కి.మీల మేర రూ.13 కోట్లతో అండర్ డ్రైనేజీ నిర్మాణ పనులు టాటా కంపెనీ ఉచితంగా చేపట్టిందన్నారు. వచ్చే ఏడాది జూన్‌లోపు పనులు పూర్తి చేసేందుకు టాటా కంపెనీ యజమాన్యం కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఏఏవో మాధవశెట్టి, మఠం ఈఈ, మఠం మేనేజర్-సి సురేష్ కోనాపూర్, ఏఈ బద్రినాథ్, శ్రీహరి, అసిస్టెంట్ మేనేజర్ ఐపీ నరసింహమూర్తి, శ్రీపతాచార్, ద్వారపాలక అనంతస్వామి, ప్రకాష్‌చార్, పవనాచార్ పాల్గొన్నారు.

## బలమైన బంధాలతోనే విద్యా వికాసం

● పేరెంట్స్ అండ్ టీచర్స్ మీటింగ్‌లో కలెక్టర్ రంజిత్ బాషా

**కర్నూలు ఎడ్యుకేషన్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి):** ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రుల మధ్య బలమైన బంధాలు ఏర్పడితేనే విద్యా వికాసం సాధ్యమని కలెక్టర్ పి. రంజిత్‌బాషా అన్నారు. శనివారం స్థానిక కంట్రోల్ రూమ్ సమీపంలో ఉన్న డా. ఏపీజే అబ్దుల్ కలాం మున్సిపల్ హైస్కూల్‌లో జరిగిన పేరెంట్స్, టీచర్స్ సమావేశంలో కలెక్టర్ రంజిత్ బాషా మాట్లాడుతూ విద్యారంగాన్ని బలోపేతం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం మెగా పేరెంట్స్ టీచర్స్ మీట్‌ను జరుపుతున్నదని అన్నారు. జిల్లాలో 147 పాఠశాలల్లో మెగా టీచర్స్ మీటింగ్ జరుపుతున్నట్లు వివరించారు. విద్యా రంగంలో పలు సంస్కరణలు తేవాలని సీఎం, విద్యాశాఖ మంత్రి సంకల్పించారన్నారు. ఉపాధ్యాయులు నిబద్ధత, అంకితభావంతో పని చేస్తే తల్లిదండ్రులకు నమ్మకం, భరోసా కలుగుతాయని అన్నారు.

● **రాష్ట్ర స్థాయిలో అవార్డులు :** ఉపాధ్యాయులు చేసిన కృషి వల్ల విద్యార్థులకు రాష్ట్రస్థాయిలో అవార్డులు వచ్చాయని కలెక్టర్ పి. రంజిత్ బాషా తెలిపారు. జిల్లా విద్యాశాఖ అధికారి శ్యామ్యూల్ పాల్ మాట్లాడుతూ రాష్ట్ర స్థాయిలో అనేక అవార్డులు పొందిన పాఠశాలగా జిల్లాకు గుర్తింపు తెచ్చిందన్నారు. మెగా టీచర్స్ పేరెంట్స్ సమావేశాలను పండుగ వాతావరణంలో నిర్వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఛైర్మన్ గౌసియా, టూటౌన్ సీఐ విజయకుమార్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



విద్యార్థినికి బహుమతిని అందిస్తున్న కలెక్టర్

## పిల్లల చదువుపై శ్రద్ధ వహించాలి

కలెక్టర్ రాజకుమారి

**బేతంచెర్ల, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి):** పిల్లలు చదువుకొని భవిష్యత్తులో రాణించాలంటే ఉపాధ్యాయులతో పాటు తల్లిదండ్రులు కూడా శ్రద్ధ వహించాలని కలెక్టర్ రాజకుమారి అన్నారు. శనివారం మండలంలోని ఆర్ఎస్ రంగాపురం జిల్లా పరిషత్ పాఠశాలలో తల్లిదండ్రుల ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా కలెక్టర్ రాజకుమారి హాజరై మాట్లాడారు. తాను కూడా ప్రభుత్వ పాఠశాలల్లో చదివి కలెక్టర్‌గా మీ ముందుకు వచ్చానన్నారు. పిల్లలతో కొంత సమయం గడుపుతూ సరైన మార్గంలో నడిపించాలన్నారు. ఏపీ ఆదర్శ పాఠశాలలో ముఖ్య అతిథులుగా డోన్ డీఎస్పీ శ్రీనివవాసులు, సీఐ వెంకటేశ్వరరావు హాజరు కాగా, ఎంపీడీవో ఫజిల్ రెహిమాన్ మాట్లాడుతూ విద్యార్థి దశలోనే విద్యార్థులు తమ భవిష్యత్తుకు ఉజ్వల బాటలు వేసుకోవాలని సూచించారు. అలాగే కేజీబీవీ పాఠశాలలో బాలికల అభివృద్ధి అధికారి సువర్చల పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేశారు. కార్యక్రమంలో ఎంఈవోలు సోమశేఖర్, పురుషోత్తంరెడ్డి, టీడీపీ మండల కన్వీనర్ ఎల్లనాగయ్య, సర్పంచ్ రాజు, హెచ్ఎంలు మల్లికార్జున, ప్రిన్సిపాల్ మరియదాసు, అబుదాబి బేగం, కౌన్సిలర్ రామ్మూర్తి, షేక్షావలి చౌదరి, విద్యాకమిటీల ఛైర్మన్లు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ రాజకుమారి

### 13 వరకు బీఈడీ స్పాట్ అడ్మిషన్లు

**కర్నూలు అర్బన్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి):** 2024-25 విద్యాసంవత్సరానికి ప్రభుత్వ బీఈడీ కళాశాలలో రెండు ఏళ్ల కోర్సులో భర్తీ కాకుండా మిగిలిన సీట్లకు స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నామని ప్రిన్సిపాల్ ఆర్ నారాయణ రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. బీ క్యాంప్‌లోని ప్రభుత్వ బీఈడీ కళాశాలలో ఈనెల 8 నుంచి 13 వరకు ఏపీఎస్‌సీహెచ్‌ఈ మార్గదర్శకాల ప్రకారం 2024 సంవత్సరంలో ఏపీ ఎడ్ సెట్‌లో అర్హత సాధించిన అభ్యర్థులకు మాత్రమే అడ్మిషన్లు వర్తిస్తాయని పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు తమ ఒరిజనల్ ధ్రువపత్రాలతో హాజరు కావాలని కోరారు. వివరాల కోసం 939869207నంబరును సంప్రదించాలని సూచించారు.

### జడ్పీలో కారుణ్య నియామకాలు



నియామకపత్రాలు అందజేస్తున్న ఛైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, సీఈవో నాసరరెడ్డి

**కర్నూలు న్యూసిటీ, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి):** జిల్లా పరిషత్ పరిధిలో ఖాళీగా ఉన్న నాల్గవ తరగతి ఉద్యోగాల పోస్టులను కారుణ్యనియామకం కింద భర్తీ చేశారు. ఈ మేరకు జిల్లా పరిషత్ ఛైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. శనివారం జడ్పీ కార్యాలయంలో ఛైర్మన్ ఎర్రబోతుల పాపి రెడ్డి, సీఈవో జి.నాసరరెడ్డి ముగ్గురు ఉద్యోగులకు నియామ కపత్రాలను అందజేశారు. జ్యోతి ప్రసాద్‌ను నంద్యాల జిల్లా దొర్నిపాడు జడ్పీ ఉన్న పాఠశాల, హెచ్.ఎస్.హారూన్ రషీద్‌ను ఆళ్లగడ్డ మండల ప్రజాపరిషత్తు కార్యాలయం, పి.అన్వర్ బాషను జిల్లా పరిషత్ పరిపాలన భవనానికి నియమించారు.

## నటనలో మేటి ..

కళ

● 250 నాటకాలలో నటించిన కళాకారుడు
● చింతామణి నాటకంలో భవాని పాత్రకు పెట్టింది పేరు
● టీడీపీ సాంస్కృతి విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శిగా
● కౌలుట్లయ్యనాయుడి ప్రతిభాపాటవం



భవాని పాత్రలో కౌలుట్లయ్యనాయుడు

**గోనెగండ్ల, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి):** ఆయనకు చిన్నతనం నుంచి నాటకాలు అంటే ఎంతో ఇష్టం. ఉన్నత విద్య అందకపోయిన, ఆర్థికంగా ఎదగక పోయినా నాటకాలలో అవకాశం లభిస్తే చాలు వివిధ ప్రాతలు ధరిస్తు ప్రజలు, కళాకారులు, కళాభిమానుల మన్నలు పొందుతుంటాడు. ఆయన నాటక రంగంలోని ప్రతిభను చూసి జిల్లా టీడీపీ సాంస్కృతి విభాగం జిల్లా ప్రదాన కార్యదర్శిగా ఎంపి చేసింది. ఆయనే గోనెగండ్లకు చెందిన కళాకారుడు కౌలుట్లయ్యనాయుడు. రంగస్థలంలో మేటి నటుడిగా రాణిస్తున్నాడు. ఇప్పటి వరకు దాదాపు 250 నాటకాలలో నటించిన కళాకారుడు. చింతామణి నాటకంలో భవాని పాత్రకు పెట్టింది పేరు. ఈ ప్రాంతంలో చింతామణి నాటకం ఉంది అంటే భవాని పాత్రలో కౌలుట్లయ్యనాయుడు ఉన్నడని అర్థం. అంతగా పాత్రలో ఒదిగి పోతాడు. అలాగే రాముడు, కృష్ణుడు, అర్జునుడు, నక్షత్రకుడు, ఇలా ఏ పాత్రలోనైనా అలవోక గా ఒదిగి పోతాడు. స్థానిక నాటకాలలో నే గాక ఎమ్మిగనూరు, నందవరం, కర్నూలు, నంద్యాల, గిద్దలూరు, మంత్రాలయం తదితర ప్రాంతాలలో పలు నాటకాలు ప్రదర్శించారు. ఈ సందర్భంగా పలు మార్లు ఉన్నతాధికారులు సన్మానాలు కూడా చేశారు. కళాకారులకు ప్రభుత్వ ప్రోత్సాహం అందిస్తే మరింత ముందుకు పోతారని ఆయన అంటున్నాడు.



అధికారులు కౌలుట్లయ్యనాయుడిని సన్మానిస్తున్న దృశ్యం





అర్జునుడి పాత్రలో




## బడికి పోవాలంటే.. బురద తొక్కాల్సిందే..!




యు. బొల్లవరం పాఠశాల ఎదుట బురదగుంటగా మారిన రహదారి

**మహానంది, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి):** అధ్వానంగా.. బురదమయంగా కనిపిస్తున్న ఈ రోడ్డు మహానంది మండలం యు.బొల్లవరం గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలకు వెళ్లే దారి. రోడ్డు అధ్వానంగా ఉన్న ఈ దారిలోనే విద్యార్థులు నిత్యం పాఠశాలకు వెళ్లాల్సిన పరిస్థితి. చిన్నపాటి వర్షం కురిసినా చాలు మొత్తం బురదమయంగా మారి వెళ్లడానికి ఏమాత్రం వీలుగా ఉండదు. గ్రామంలో ప్రధాన రహదారిని సీసీ రోడ్డుగా నిర్మించినప్పటికి ఇరుప్రక్కల డ్రైనేజీ నిర్మించకపోవడంతో ఈ సమస్య ఏర్పడుతోంది. ఇళ్లలోని మురుగుతో పాటు ఇటీవల కురిసిన వర్షాలకు బురదమయంగా మారింది. దీంతో పాఠశాలకు వెళ్లేందుకు విద్యార్థులు సర్కస్ ఫీట్లు చేస్తున్నారు. అటువైపు వెళ్ళే ప్రజలు సైతం అతి కష్టం మీద వెళ్తున్నారు. శనివారం మెగా పేరెంట్స్, టీచింగ్ మీటింగ్‌కు ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులతో పాటు అధికారులు సైతం అదే దారిలోనే ఆపసోపాలు పడుతూ వెళ్లారు.



## స్నాతకోత్సవానికి గవర్నర్ రాక

- ఫిబ్రవరి 8న కార్యక్రమానికి ఏర్పాట్లు
- క్లస్టర్ వర్సిటీ ఉప కులపతి డీవీఆర్ సాయిగోపాల్



మాట్లాడుతున్న క్లస్టర్ వర్సిటీ ఉపకులపతి

**కర్నూలు అర్బన్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి):** క్లస్టర్ యూనివర్సిటీలో ఫిబ్రవరి 8న నిర్వహించనున్న మొదటి స్నాతకోత్సవానికి గవర్నర్ అబ్దుల్ నజీర్ ముఖ్య అతిథిగా హాజరు కానున్నట్లు ఉపకులపతి, ప్రొఫెసర్ డీవీఆర్ సాయిగోపాల్ తెలిపారు. శనివారం క్లస్టర్ యూనివర్సిటీలో రిజిస్ట్రార్ కట్టా వెంకటేశ్వర్లుతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ స్నాతకోత్సవానికి సంబంధించి జనవరి 8లోపు విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. 2021-22 విద్యా సంవత్సరానికి గాను డిగ్రీ, పీజీ పూర్తి చేసిన 770 మంది విద్యార్థులు ఉన్నారని, వారందరికి ఇప్పటికే సమాచారం అందించామన్నారు. వర్సిటీ వెబ్ సైట్‌లో వివరాలు తెలుసుకోవాలని సూచించారు. స్నాతకోత్సవ సదస్సులో గవర్నర్ సర్టిఫికెట్లు అందజేస్తారని తెలిపారు. ప్రతిభ కనపరిచిన విద్యార్థులకు అవార్డు, గోల్డ్ మెడల్, పారితోషికం వంటివి ప్రోత్సాహకాలుగా అందజేయడానికి దాతలు, విద్యావేత్తలు, పూర్వవిద్యార్థులు, వివిధ సంస్థలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఓఎస్డీ డాక్టర్ ఎస్ఎం బాషా, పీఆర్వో డాక్టర్ పార్వతి దేవి, ఏపీఆర్వో డాక్టర్ వింధ్యా వాసిని పాల్గొన్నారు.

# భయపెడుతున్న ధరలు



కూరగాయలు కొంటున్న వినియోగదారుడు

- సామాన్యులపై పెనుభారం
- పెరిగిన బియ్యం, వంట నూనెలు, కూరగాయల ధరలు

**ఆలూరు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి):** నిత్యావసరాల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. సామాన్యులు కిరాణ షాపులకు, కూరగాయల మార్కెట్‌కు వెళ్లాలంటే భయపడు తున్నారు. ఒక రోజు ఉన్న ధరలు మరుసటి రోజు ఉండటం లేదు. చేతిలో ఉన్న డబ్బులకు ఏది కొనాలో, ఏది మానేయాలో తెలియక ఇబ్బందిపడుతున్నారు. పేద, మధ్య తరగతి కుటుంబాల్లో పూట గడవడం కష్టంగా మారింది. బియ్యం, పప్పులు, నూనెలు, కూరగా యలు, చికెన్, కోడిగుడ్లతో సహా అన్నీ అందనంతగా ధరలు పెరిగాయి.

**వంటింట్లో ధరల మంట**

వంటింట్లో ప్రతి పూట అత్యవసరమైన బియ్యం ధరలు పెరిగిపోయాయి. సోనా మసూరి బియ్యం కేజీ రూ.70కు చేరుకుంది. ఎండిల్ సోనా రూ.55-65ల వరకు అమ్ముతున్నారు. కందిపప్పు కేజీ రూ.180లకు చేరింది. మినపపప్పు రూ.140, పెసరపప్పు రూ.140లకు చేరుకున్నాయి.

### కొనేలా లేని వంట నూనెలు

కేంద్ర ప్రభుత్వం వంటనూనెలపై దిగుమతి సుంకం పెంచడంతో వంటనూనె ధరలు కేజీకి గత రెండు నెలల్లోనే రూ.30 పెరిగాయి. వేరుశనగ నూనె కేజీ రూ.200, సన్‌ఫ్లవర్ రూ. 160, నువ్వులనూనె రూ.480, కొబ్బరి నూనె లీటరు రూ.360లకు చేరింది.



**ధరలు తగ్గించాలి**



మార్కెట్‌లో పెరిగిన అన్ని రకాల నిత్యావసరాలు, కూరగాయల ధరల తగ్గింపునకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దృష్టి సారించాలి. రూ.500లు మార్కెట్‌కు తీసుకెళ్తే 5రకాల వస్తువులు రావడం లేదు. గుడ్లు, చికెన్, మటన్, ధరలు అమాంతంగా పెరిగాయి.

**- పాన్ వీరేష్, ఆలూరు**

### ఆకాశాన్నంటుకున్న కూరగాయలు

నిత్యావసర వస్తువులతో పాటు కూరగాయల ధరలు కూడా సామాన్యులకు అందుబాటులో లేవు. ప్రతిరోజూ వంటల్లో వాడే ఉల్లిపాయలు, టమోటా ధరలు మోత మోగిస్తున్నాయి. మూడు నెలల నుంచి ఉల్లిపాయలు కేజీ రూ.60పైమాటే. ప్రతి కూరలో వాడే టమోటాలు రూ.50కి చేరుకున్నాయి. వంకాయలు కేజీ రూ.50, బీరకాయలు రూ.60, క్యారెట్ రూ.70 పలుకుతున్నాయి. బెండ, దొండకాయలు రూ.40పైమాటే. ఎన్నడూ లేనంతగా దోసకాయలు, ఆనపకాయలు, పొట్లకాయలు కూడా రూ.30-40 పలుకుతున్నాయి. చిక్కుళ్ళు రూ.80కి పెరిగాయి. ఆకు కూరలు కట్ట రూ.20 తక్కువ లేదు. అక్టోబరు మాసంలో వచ్చిన వానలు, వరదలకు కూరగాయల పంటలు దెబ్బతిన్నాయి. దీంతో దిగుబడి తగ్గి ధరలు పెరిగిపోయాయి. కార్తీక మాసం రావడంతో ధరలు మరింత పెరిగాయి. కేజీ స్కిన్‌లెస్ చికెన్ రూ.240కి చేరింది. కోడి గుడ్డు రూ.5నుంచి రూ.7.50 పైసలు వరకు పెరిగింది. మటన్ రూ.800లకు చేరుకుంది. వెల్లుల్లి ఐదు నెలల క్రితం కేజీ రూ.150లు ఉండగా ఇప్పుడు కిలో రూ.400లకు అమ్ముతున్నారు.

**సామాన్యుడు బతకలేని పరిస్థితి**



అన్ని రకాల ధరలు విపరీతంగా పెరగటంతో ప్రజల బతుకు ప్రశ్నార్థకమైంది. కూరగాయల దగ్గర నుంచి ఉప్పులు, పప్పులు, బియ్యం, చింతపండు ఇలా ఒకటేమిటి సామాన్యులకు ఏవీ అందుబాటులో లేవు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ధరలు తగ్గించేందుకు చర్యలు తీసుకోవాలి. దళారీ వ్యవస్థ కారణంగా ధరలు విపరీతంగా పెరిగాయి.

**- గిడ్డయ్య, సీపీఐ జిల్లా కార్యదర్శి**

## తుంగభద్రలో మృతదేహం లభ్యం

**కర్నూలు క్రైం, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి):** మూడు రోజుల క్రితం రైలు నుంచి కిందపడిన గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం శనివారం లభించింది. రైల్వే ఎస్ఐ కిరణ్‌బాబు తెలిపిన వివరాల ప్రకారం.. ఈనెల 5న గుంటూరు నుంచి కాచిగూడకు వెళ్లిన రైలులో ప్రయాణించిన గుర్తుతెలియని వ్యక్తి తుంగభద్ర నదిలో పడిపోయాడు. స్థానికులు ఇచ్చిన సమాచారంతో రైల్వే పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. పోలీసులు మృతదేహం కోసం గాలించగా శనివారం బయట పడింది. మృతుడి వయస్సు 40 ఏళ్లు ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు. మృతుడి శరీరంపై ఎరుపు రంగు చొక్కా, నలుపు రంగు ప్యాంటు ధరించి ఉన్నాడు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు రైల్వే పోలీసులను సంప్రదించాలని ఎస్ఐ కిరణ్‌బాబు తెలిపారు.

## బైకుల ఢీ : ఒకరి పరిస్థితి విషమం

**ఆదోని రూరల్ డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి):** మండలంలోని బసాపురం ఎల్లెల్సీ గట్టుపై రెండు బైకులు ఢీకొని ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. వివరాలు.. కౌతాళం మండలం కామవరం గ్రామానికి చెందిన అయ్యప్ప కొన్ని సంవత్సరాలుగా బసాపురంలో ఉంటూ, గొర్రెలను మేపుతున్నారు. శనివారం బైక్‌పై ఎల్లెల్సీ గట్టుమీదుగా గొర్రెల వద్దకు వెళ్తుండగా, మరోవైపు బెలగాంకు చెందిన గొర్రెల కాపరి బైక్ అయ్యప్పను ఢీకొంది. అయ్యప్ప కాలు విరగడంతో ఆదోని ఏరియా ఆసుపత్రిలో ప్రథమ చికిత్స అనంతరం కర్నూలుకు తరలించారు. ఇస్వీ పోలీసులు కేసు విచారణ చేపట్టారు.

## వాహనంపై విరిగిపడ్డ వృక్షం

- స్వల్ప గాయాలతో బయటపడ్డ డ్రైవర్



వాహనంపై విరిగిపడిన చెట్టు

**మిడుతూరు, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి):** మిడుతూరు గ్రామ సమీపంలోని నాగలూటి గ్రామ రహదారిలో పొలం వద్ద ఉన్న తుమ్మచెట్టును ఎర్రగుట్ల నుంచి పైపాలెం సోలార్ పనులకు వెళ్తున్న వాహనం శుక్రవారం రాత్రి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ మధు స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. వాహనం ఢీ కొట్టడంతో చెట్టు విరిగి రహదిరికి అడ్డంగా పడిపోయింది. శుక్రవారం రాత్రి నుంచి వాహనాల రాకపోకలు నిలిచి పోయాయి. పోలీసులు శనివారం ఘటనా స్థలాకి చేరుకుని రహదారికి అడ్డంగా ఉన్న చెట్టును తొలగించారు.

## మోడల్ స్కూల్ విద్యార్థికి పాము కాటు

- ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థి
- పాఠశాలలో ఆత్మీయ సమావేశంలో ఘటన



చికిత్స పొందుతున్న విద్యార్థి విష్ణువర్దన్

**కోసిగి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి):** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా శనివారం ప్రభుత్వ పాఠశాలల్లో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేశారు. కోసిగి మండలంలోని మోడల్ స్కూల్‌లో కోసిగికి చెందిన 7వ తరగతి విద్యార్థి వడ్ల విష్ణువర్ధన్ పాఠశాల బయట తన స్నేహి తులతో పాటు షూస్ వదిలి వెళ్తుం డగా.. మరో విద్యార్థి షూ నుంచి పాము బయటకు వచ్చి విద్యార్థి విష్ణువర్దన్ ఎడమకాలుకు కాటు వేసింది. వెంటనే ప్రిన్సిపాల్ సమీరారెడ్డి, ఉపాధ్యాయులు కోసిగి ప్రభుత్వాసుపత్రికి తీసుకువచ్చారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం ఆదోని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆదోని ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కోలుకుంటు న్నట్లు తల్లిదండ్రులు శ్రీనివాసాచారి, లక్ష్మిలు తెలిపారు. బడులకు వచ్చిన తల్లిదండ్రుల ఎదుటే తమ కుమారుడుకు పాము కాటు వేయడంతో తల్లిదండ్రులు కన్నీరు పెట్టుకున్నారు. ఎలాంటి ప్రమాదం లేదని డాక్టర్లు చెప్పడంతో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఊపిరి పీల్చుకున్నారు.

## ఫీల్డ్ అసిస్టెంటుపై విచారణ

**రుద్రవరం, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి):** కోటకొండ గ్రామానికి చెందిన ఫీల్డ్ అసిస్టెంటు మోహన్‌రాజుపై శనివారం ఉపాధి హామీ పథకం పీడీ జనార్దన్‌రావు ఆదేశాల మేరకు ఏపీడీ సాంబశివరావు శనివారం విచారణ జరిపారు. గ్రామంలో ఉపాధి హామీ పథకం పనుల్లో గ్రామంలో లేని అంగన్‌వాడీ ఆయా, ఆశా కార్యకర్తలకు వేతనాలు ఇచ్చారని స్థానికులు విచారణలో ఏపీడీకి వివరించారు. గ్రామంలో సుమారు 10 మందికి పైగా వ్యక్తులను విచారించారు. నివేదికను ఉన్నతాధికారులకు పంపనున్నట్లు ఏపీడీ తెలిపారు.

## నల్లగట్లలో ఉద్రిక్తత

**ఆళ్లగడ్డ(శిరివెళ్ల), డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి):** ఆళ్లగడ్డ మండల పరిధిలోని నల్లగట్లలో ఆస్థి తాగాదాలతో శనివారం రాత్రి ఉద్రిక్తత చోటుచేసుకుంది. అన్నదమ్ములు రమణ, నాగరాజు మధ్య కొంత కాలంగా ఆస్థి తగాదా ఉంది. సమస్య పరిష్కారం కాకపోవడంతో నాగరాజు భార్య హేమలత, కుమారుడు మాధవ్‌పై అన్న రమణ, కుటుంబసభ్యులు దాడి చేశారు. క్షతగాత్రులను మెరుగైన వైద్యం నిమిత్తం వారిని నంద్యాలకు తరలించారు. ఆళ్లగడ్డ రూరల్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## కూటమి ప్రభుత్వంతోనే రైతులకు న్యాయం: ఎమ్మెల్యే బుడ్డా



పార్నపల్లెలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి

**బండిఆత్మకూరు, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి):** కూటమి ప్రభుత్వంతోనే రైతులకు న్యాయం జరుగుతుందని ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డి అన్నారు. పార్నపల్లె గ్రామంలో శనివారం రాత్రి రైతులు, సహకార సంఘాల అధికారులతో నియోజకవర్గ సమన్వయకర బన్నూరు రామలింగారెడ్డి అధ్యక్షతన సమన్వయ సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ వైసీపీ హయాంలో గోదాములు అస్తవ్యస్తంగా నిర్మించారని, అవి ఇప్పటికిప్పుడు వినియోగంలోకి రావాలంటే చాలా కష్టమన్నారు. రైతులకు గిట్టుబాటు ధర కోసం శాయశక్తులా కృషి చేస్తానన్నారు. రైతుల సంక్షేమమే తమ ధ్యేయమని అందుకు రైతులే సూచనలు సలహాలు ఇవ్వాలని సూచించారు. డీసీవో వెంకటసుబ్బయ్య, నాయకులు సురేష్‌రెడ్డి, నరసింహారెడ్డి, భరద్వాజశర్మ, మనోహర్‌చౌదరి, మల్లీశ్వరరెడ్డి, చిన్నలింగారెడ్డి, సుబ్బారెడ్డి, బుగ్గరాముడు, శంకర్‌రెడ్డి పాల్గొన్నారు.

## 19న కాంట్రాక్టు ఉద్యోగుల మహాసభ

- కరపత్రాలు విడుదల చేసిన రాష్ట్ర నాయకులు

**కర్నూలు హస్పిటల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి):** ఏపీ మెడికల్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ 6వ రాష్ట్ర సభను ఈ నెల 19న విజయవాడలో నిర్వహించనున్నట్లు యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్. మునెప్ప, రాష్ట్ర గౌరవాధ్యక్షులు ఎస్.మనోహర్ మానిక్యం తెలిపారు. శనివారం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలోని యూనియన్ ఆఫీసులో వారు కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ బోధనాసుపత్రులు పీహెచ్‌సీ, సీహెచ్‌సీలో పని చేసే శానిటేషన్ సెక్యూరిటీ పెస్ట్ కంట్రోల్ కార్మికులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విజయవాడలోని దాసరి భవన్‌లో జరిగే యూనియన్ రాష్ట్ర మహాసభలో భవిష్యత్ నిర్ణయాలను ప్రకటిస్తామన్నారు. మహాసభకు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న శానిటేషన్, సెక్యూరిటీ, పెస్ట్ కంట్రోల్ కార్మికులు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు. సమావేశంలో యూనియన్ జిల్లా కార్యదర్శి ఎస్.నాగరాజు, సెక్యూరిటీ గార్డ్, శానిటేషన్, యూనియన్ నాయకులు రాజు,సురేష్, శ్రీరాములు, తదితరులు పాల్గొన్నారు.



దాతకు చిత్రపటాన్ని అందజేస్తూ..

## అన్నప్రసాద పథకానికి విరాళం

**శ్రీశైలం, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి):** శ్రీశైలం మహాక్షేత్రంలో భక్తుల సౌకర్యార్థం నిర్వహిస్తున్న శాశ్వత అన్నప్రసాద వితరణ పథకానికి హైదరాబాద్‌కు చెందిన కొవ్వూరి శ్రీనివాసులు అనే భక్తుడు రూ. 1,01,116 విరాళాన్ని పర్యవేక్షకురాలు టి.హిమబిందుకు అందజేశారు. దాతకు దేవస్థానం అధికారులు స్వామివారి శేషవస్త్రం, స్వామి, అమ్మవార్ల చిత్రపటం, ప్రసాదాలను అందజేసి సత్కరించారు.

## మధ్యవర్తిత్వంతో సత్వర న్యాయం

- న్యాయాధికారి పాండురంగారెడ్డి




మాట్లాడుతున్న 6వ అదనపు న్యాయాధికారి పి. పాండురంగారెడ్డి

**కర్నూలు లీగల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి):** కక్షిదారులు, న్యాయవాదులు, మధ్యవర్తిత్వాన్ని ఆశ్రయిస్తే సత్వర న్యాయం పొందవచ్చని 6వ అదనపు జిల్లా న్యాయాధికారి పి. పాండురంగారెడ్డి తెలియజేశారు. స్థానిక న్యాయ సేవా సంస్థ ఆధ్వర్యంలో లోక్ అదాలత్ భవనంలో మధ్యవర్తిత్వంపై ఒక ప్రత్యేక సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మధ్యవర్తిత్వంతో అనేక లాభాలు ఉన్నాయని, కక్షిదారులు, న్యాయవాదులు ఈ మధ్యవర్తిత్వాన్ని అంగీకరిస్తే.. పెద్ద సంఖ్యలో కేసులు పరిష్కరించుకోవచ్చని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మధ్యవర్తిత్వం, విధి విధానాల గురించి న్యాయవాదులకు వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ బి. లీలా వెంకట శేషాద్రి మాట్లాడుతూ మధ్యవర్తిత్వం అనేది ఉభయ పార్టీలకు ఆమోదయోగ్యమైన ఒక విధానమని, కక్షిదారులు మధ్యవర్తిత్వాన్ని ఆశ్రయిస్తే ఖర్చు లేకుండా సత్వర న్యాయం పొందవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కృష్ణమూర్తి, ప్రధాన కార్యదర్శి బీఎస్ రవికాంత్ ప్రసాద్ పాల్గొన్నారు.

## అక్రమ మద్యం కేసులో నిందితుల అరెస్టు



మద్యం బాక్సులను చూపుతున్న డోన్ రూరల్ పోలీసులు

**డోన్ రూరల్, డిసెంబరు 7 (ఆంధ్ర జ్యోతి):** మండలంలోని తాటివాను కొత్తూరు గ్రామ సమీపంలోని 44వ నెంబర్ జాతీయ రహదారిపై అక్రమ మద్యాన్ని స్వాధీనం చేసుకొని నిందితులను డోన్ రూరల్ పోలీసులు అరెస్టు చేశారు. డోన్ రూరల్ సీఐ రాకేష్ తన పోలీసు సిబ్బందితో తనిఖీ చేస్తుండగా.. కారులో తరలిస్తున్న అక్రమ 20 బాక్సుల టెట్రా ప్యాకెట్లను గుర్తించి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కర్ణాటకకు చెందిన 1920 టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. తుగ్గలి మండలం చెన్నంపల్లి గ్రామానికి చెందిన ఈడిగ సోమశేఖర్, అదే మండలానికి చెందిన గుడిసె గుప్పరాళ్ల గ్రామానికి చెందిన ఈడిగ సురేంద్ర కర్ణాటక రాష్ట్రం రాయచూరు నుంచి మద్యం తీసుకుని వచ్చి గ్రామాల్లో అధిక రేట్లకు విక్రయిస్తున్నారని పోలీసులు తెలిపారు. ఆ మేరకు నిందితులను అరెస్టు చేసి డోన్ కోర్టులో హాజరు పరుస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## మతిస్థిమితం లేని పని..!

- వైఎస్ఆర్ విగ్రహానికి చెప్పుల దండ వేసిన వ్యక్తి

**ఎమ్మిగనూరు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి):** ఎమ్మిగనూరు పట్టణంలోని వైఎస్ఆర్ సర్కిల్‌లో ఉన్న వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి ఓ మతిస్థిమితం లేని వ్యక్తి చెప్పుల దండను వేశాడు. శనివారం ఉదయం ఉన్నట్టుండి ఓ మతి స్థిమితం లేని వ్యక్తి రెండు చెప్పులను తీసుకొని పైకి ఎక్కి తాడుతో వాటిని కట్టి వైఎస్ విగ్రహం మెడలో వేసి తాపీగా కిందికి దిగిపోయాడు.

స్థానికులు వైసీపీనాయకులకు, పోలీసులకు సమాచారం అందించారు. అక్కడే ఉన్న ఓ వైసీపీ కార్యకర్త వైఎస్ఆర్ మెడలో ఉన్న చెప్పులను తొలగించాడు. వైసీపీ సీనియర్ నాయకుడు వై.రుద్రగౌడ్, మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్ అహ్మద్, నాయకులు సునీల్, కోటేకల్ లక్ష్మన్న అక్కడికి చేరుకొని వైఎస్ విగ్రహానికి క్షీరాభిషేకం చేసి, పూలదండలు వేశారు. మరోసారి ఇలాంటి సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని పోలీసులకు వినతిపత్రం అందించారు.



క్షీరాభిషేకం చేస్తున్న వైసీపీ నాయకులు

## బాలిక అదృశ్యం

**మిడుతూరు, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి):** మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక అదృశ్యమైనట్లు ఏఎస్ఐ సుబ్బయ్య తెలిపారు. వివరాలివీ.. బాలిక ఈ నెల 5వతేది ఉదయం 5గంటల నుంచి ఇంటిలో కనబడం లేదని, బంధువుల దగ్గర వెతికినా కనిపించడం లేదని శనివారం బాలిక తల్లి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ తెలిపారు.

## ప్రైవేటు పాఠశాల ఉపాధ్యాయుడిపై కేసు నమోదు

**బనగానపల్లె, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి):** పట్టణంలోని శ్రీ చైతన్య ప్రైవేటు పాఠశాలకు చెందిన ఉపాధ్యాయుడు ధృవకుమార్ అధిక మార్కులు వేయిస్తామని విద్యార్థుల నుంచి డబ్బులు వసూలు చేసినట్లు పాఠశాల యాజమాన్యం శనివారం ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ దుగ్గిరెడ్డి తెలిపారు. గణితం ఉపాధ్యాయుడు ధృవకుమార్ యాజమాన్యానికి తెలియకుండా పరీక్షల్లో అధికంగా మార్కులు వేయిస్తానని డబ్బులు వసూలు చేసినట్లు ఫిర్యాదు అందిందన్నారు. ఈమేరకు ధృవకుమార్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. కాగా ఉపాధ్యాయుడు విద్యార్థినులతో అసభ్యంగా ప్రవర్తిస్తున్నట్లు తెలిసి వారి తల్లిదండ్రులు దేహశుద్ధి చేసి పోలీస్‌స్టేషన్‌కు అప్పగించినట్లు సమాచారం.

## సైబర్ నేరగాళ్ల వలలో నిరుద్యోగి

- మూడు గంటలు పనిచేస్తే రూ.30 వేలు ఇస్తామని మోసం
- నిరుద్యోగి నుంచి రూ.4.60 లక్షలు కాజేసిన సైబర్ నేరగాళ్లు
- పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించిన బాధితుడు



బాధితుడు హరీష్ గౌడ్

**హొళగుంద, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి):** నిరుద్యోగులకు పార్ట్ టైమ్ జాబ్స్ ఆశ చూపించి సైబర్ నేరగాళ్లు మోసం చేస్తున్నారు. ఇలాంటి ఘటన కర్నూలు జిల్లా హొళగుంద మండలం నేరణికి గ్రామంలో వెలుగు చూసింది. డిగ్రీ వరకు చదువుకున్న హరీష్ గౌడ్ అనే నిరుద్యోగి వాట్సప్‌కు ఈనెల 2న ఒక మెసేజ్ వచ్చింది. అందులో పార్ట్‌టైం జాబ్ మూడు గంటలు చేస్తే రూ.30,000 వేలకుపైగా జీతం ఇస్తామని ఉంది. హరీష్ దానికి రిప్లై ఇచ్చాడు. ఈ ఉచ్చు పన్నిన సైబర్ నేరగాళ్ళు హరీష్‌ను టార్గెట్ చేశారు. అతనికి ఓ లింక్ పంపించారు. ఓ మహిళా కాల్ చేసి పార్ట్ టైం జాబ్ ఉందని, దాని కోసం ముందస్తుగా కొంత నగదు పంపిస్తే ఉద్యోగం రిజర్వ్ చేస్తామని చెప్పారు. ఈ మాటలు నమ్మి హరీష్ వారు చెప్పిన ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు ఖాతా నెంబర్ ఏ/సీ 99522210008273కు రూ. 1,74,264 జమ చేశాడు. ఆ తర్వాత మరోసారి ఇంకొంత డబ్బు పంపమని చెప్పడంతో అదే ఖాతాకు రూ.69,065 జమ చేశాడు. ఇట్లా రూ.4,60,000 చెల్లించాక కూడా ఇంకా డబ్బు పంపమని చెప్పడంతో హరీష్‌కు అనుమానం వచ్చింది. సైబర్ నేరగాళ్ల పంపిన లింక్‌లను ఆన్‌లైన్ లో పరిశీలించగా అది ఫేక్ అని తెలిసింది. తాను మోసపోయినట్లు గుర్తించి పోలీసులను ఆశ్రయించాడు. ఉద్యోగం వస్తుందన్న ఆశతో చేసిన లక్షల రూపాయల అప్పు ఎలా తీర్చాలో తెలియడం లేదని కన్నీటి పర్యంతం అయ్యాడు.

నంద్యాల
నంద్యాల, నందికొట్కూరు, శ్రీశైలం, పాణ్యం

# విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు

● మెగా పేరెంట్స్, టీచర్స్ మీట్‌లో ముఖ్య అతిథులు ● అధిక సంఖ్యలో తరలివచ్చిన తల్లిదండ్రులు, పూర్వ విద్యార్థులు
● సందడి చేసిన విద్యార్థులు ● అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు ● పాఠశాలల అభివృద్ధి, విద్యార్థుల భవిష్యత్తుపై చర్చ


ఆత్మకూరులో మాట్లాడుతున్న శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి


కొణిదేల పాఠశాలలో ఎమ్మెల్యే జయసూర్య, చెక్కులను అందిస్తున్న దాతలు


నంద్యాల: మాట్లాడుతున్న ఏపీ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ మౌలానా ముస్తాక్ అహ్మద్


పాణ్యం: గిరిజన గురుకుల పాఠశాలలో నృత్యం చేస్తున్న విద్యార్థినులు


గడివేములలో..


బండిఆత్మకూరు: కేజీబీవీలో కోలాట నృత్యం చేస్తున్న విద్యార్థినులు

విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని పలువురు అన్నారు. మెగా పేరెంట్స్-టీచర్స్ మీట్ శనివారం పండుగలా సాగింది. ఈ కార్యక్రమానికి విద్యార్థుల తల్లిదండ్రులు, పూర్వ విద్యార్థులతో పాటు ప్రజలు అధిక సంఖ్యలో తరలిరావడంతో పాఠశాలల్లో సందడి నెలకొంది. ముందుగా వీరికి ఉపాధ్యాయులు ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమానికి హాజరైన ముఖ్య అతిథులు విద్యార్థులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. విద్యార్థుల తల్లిదండ్రులకు ఆటల పోటీలు నిర్వహించారు. సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. విద్యార్థులకు ప్రోగ్రెస్ కార్డులను అందజేశారు. కార్యక్రమం అనంతరం సహపంక్తి భోజనం చేశారు.


నంద్యాల రూరల్: కొత్తపల్లిలో ముగ్గుల పోటీల్లో పాల్గొన్న విద్యార్థుల తల్లులు

**ఆత్మకూరు, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి):** అన్నింటిలో కన్నా విద్య ఎంతో గొప్పదని అలాంటి విద్యను ఎవరూ నిర్లక్ష్యం చేయవద్దని శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి సూచించారు. ఆత్మకూరులోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో నిర్వహించిన మెగా పేరెంట్స్ అండ్ టీచర్స్ ఆత్మీయ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అయన మాట్లాడుతూ.. విద్యతోనే ఉజ్వల భవిష్యత్‌ను అందించవచ్చునన్న లక్ష్యంతో సీఎం చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ విద్యా వ్యవస్థలో సమూల మార్పులకు శ్రీకారం చుట్టారన్నారు. ఇందులో భాగంగానే తొలిసారిగా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులతో కలిసి ఇలాంటి సమావేశాలను నిర్వహించడం శుభపరిణామమని అన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను శ్రద్ద చదివించాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు ప్రోగ్రెస్ కార్డు, హెల్త్ కార్డులను పంపిణీ చేశారు. అంతకుముందు ఎమ్మెల్యే బుడ్డాకు విద్యార్థులు తయారు చేసిన పుష్పగుచ్చాలతో స్వాగతం పలుకగా ఆయన విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రమేష్‌బాబు, అర్బన్ సీఐ రాము, డాక్టర్ సాజిదా ఫిర్దోస్, ఎంఈవో బాలాజీనాయక్, హెచ్‌ఎం షాహన ఉన్నిసా, నాయకులు వేణుగోపాల్, అబ్దుల్లాపురం బాషా, రాజారెడ్డి, వెన్నా శ్రీధర్‌రెడ్డి, మల్లె ఎలీషా, నాగూర్ ఖాన్ తదితరులు ఉన్నారు.

**నందికొట్కూరు రూరల్:** పిల్లల బంగారు భవిష్యత్తు కోసం బడి వైపు ఒక్క అడుగు వేద్దాం అని నందికొట్కూరు ఎమ్మెల్యే జయసూర్య అన్నారు. అల్లూరు, కొణిదేలలో ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే జయసూర్య హాజరయ్యారు. ఎమ్మెల్యే జయసూర్య ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఎమ్మెల్యే జయసూర్య మాట్లాడుతూ తల్లిదండ్రులు నెలకోసారైనా పాఠశాలకు వచ్చి విద్యార్థుల ప్రోగెస్ గురించి తెలుసుకోవాలని సూచించారు.

● కొణిదేల గ్రామంలోని జడ్పీ హైస్కూల్ అభివృద్ధి కోసం దాతలు మల్లెపోగు చిట్టెన్న రూ.లక్ష, పండగ విమలమ్మ రూ.లక్ష చెక్కులను ఎమ్మెల్యే జయసూర్యకు అందజేశారు. కార్యక్రమంలో మాంద్ర సురేంద్రనాథరెడ్డి, ఎంఈవోలు సుబాన్, శ్రీనివాసులు, హెచ్‌ఎం శ్రీరామచంద్రమూర్తి, ఫిజికల్ డైరెక్టర్ రవికుమార్, సీఐలు సుబ్రమణ్యం, ప్రవీణ్‌కుమారెడ్డి, ఉప సర్పంచ్ భాస్కరెడ్డి, నాగటూరు ఉపసర్పంచ్ ఉశేనయ్య, మల్లికార్జునరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

**నంద్యాల రూరల్:** మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో మెగా పేరెంట్ టీచర్స్ మీట్‌ను ఘనంగా నిర్వహించారు. కొత్తపల్లి పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఎంఈవో బ్రహ్మంనాయక్ పాల్గొన్నారు.

**నంద్యాల కల్చరల్:** కూటమి హయాంలో రాష్ట్రం విద్యా హబ్‌గా అభివృద్ధి చెందుతుందని ఏపీ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ మౌలానా ముస్తాక్ అహ్మద్ అన్నారు. శనివారం నంద్యాల పట్టణంలోని ముల్లాన్‌పేటలోని మున్సిపల్ ఉర్దూ గర్ల్స్ హైస్కూల్‌లో పేరెంట్స్, టీచర్స్ ఆత్మీయ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదివి తమ తల్లితండ్రులకు తమ ప్రాంతానికి మంచి పేరు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో డీఎండబ్ల్యూవో డిస్ట్రిక్ మైనార్టీ వెల్ఫేర్ ఆఫీసర్ ఉమ్మడి కర్నూలు జిల్లా అధికారి సబీహాపర్వీన్, తదితరలు పాల్గొన్నారు.

**పాములపాడు:** మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో పేరెంట్స్-టీచర్స్ సమావేశాన్ని ఘనంగా నిర్వహించారు. పాములపాడులోని ఏఎస్ఆర్ జడ్పీ హైస్కూల్‌లో విద్యార్థుల తల్లిదండ్రులకు హచ్‌ఎం గోపాల్, ఉపాధ్యాయులు గులాబీ పూలు ఇచ్చి స్వాగతం పలికారు. అలాగే మోడల్ స్కూల్, కేజీబీవీలో నిర్వహించిన సమావేశాలలో సర్పంచ్ భాగ్యమ్మ, మండల ప్రత్యేకాధికారి రాజ్, తహసీల్దార్ సుభద్రమ్మ, ఎంపీడీవో చంద్రశేఖర్, ఎస్ఐ సురేశ్‌కుమార్ పాల్గొన్నారు.

**మిడుతూరు:** మండలంలోని వివిధ ప్రభుత్వ పాఠశాలలతో పాటు స్థానిక మోడల్ స్కూల్, జడ్పీ హైస్కూల్, కేజీబీవీలో శనివారం పేరెంట్స్ సమావేశాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ సలీంబాషా, హెచ్‌ఎం సాయితిమ్మయ్య, విజయలక్ష్మి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీవో దశరథరామయ్య, ఎస్ఐ ఓబులేసు, ఎంఈవో శ్రీనాథ్, వైద్యాధికారి తిరుపతి, టీడీపీ మండల కన్వీనర్ కాతా రమేష్ రెడ్డి హాజరయ్యారు.

**కొత్తపల్లి:** మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో పేరెంట్స్ సమావేశాన్ని ఘనంగా నిర్వహించారు. గోకవరంలో జడ్పీ హైస్కూల్‌లో ఎంఈవో-2 ఇనయతుల్లా, హెచ్‌ఎం వెంకటరమణ ఆచారి, ఎస్ఐ కేశవ్, జోహో హాస్పిటల్ అధినేత డా.మన్సూర్ బాషా, మండల ఉపాధ్యక్షుడు సింగారపు వెంకటరమణ, ఎస్ఎఫ్ఐ నాయకుడు దినేష్, గోకవరం పీహెచ్‌సీ వైద్యులు విజయేంద్ర, జి.పుల్లారెడ్డి గురుకుల ఉపాధ్యాయుడు రామకృష్ణ హాజరయ్యారు. మన్సూర్ బాషా మాట్లాడుతూ వచ్చే ఏడాది మార్చిలో పదవ తరగతిలో మొదటి స్థానంలో ఉత్తీర్ణత సాధించిన ఈ పాఠశాల విద్యార్థికి రూ.25వేలు, మెడిసిన్ సీటు సాధించిన విద్యార్థికి రూ.50వేలు ప్రోత్సాహక బహుమతి ఇస్తానని ప్రకటించారు.

**జూపాడుబంగ్లా:** మండలంలోని వివిధ గ్రామాల్లో ప్రభుత్వం చేపట్టిన ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం ప్రతి ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ మండల నాయకులు వెంకటేశ్వర్లు యాదవ్, మోహన్ రెడ్డి పాల్గొన్నారు.

**పాణ్యం:** మండలంలో మెగా పేరంట్స్ సమావేశాలు ఘనంగా నిర్వహించారు. పలు అంశాలపై చర్చించినట్లు ఎంఈవో కోటయ్య తెలిపారు.

**గడివేముల:** మండలంలో పేరెంట్స్ సమావేశాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమాల్లో తహసీల్దార్ వెంకటరమణ, ఎంపీడీవో వాసుదేవ గుప్తా, టీడీపీ మండల అధ్యక్షుడు సత్యనారాయణరెడ్డి, సీనియర్ నాయకులు రామచంద్రారెడ్డి, ఎస్ఐ రఫీక్ పాల్గొన్నారు.

**ఆత్మకూరురూరల్:** కరివేనలోని జడ్పీ హైస్కూల్‌లో పేరెంట్స్ సమావేశాన్ని ఘనంగా నిర్వహించారు. శ్రీశైలం నియోజక వర్గ ప్రత్యేకాధికారి సుధారాణి, ఆర్డీవో నాగజ్యోతి, ఎంపీపీ తిరుపాలమ్మ, కరివేన సర్పంచ్ మాణిక్యమ్మ,టీడీపీ నాయకులు శరత్, శివ శంకర శర్మ, కొండలరావు, దినకర్, శేషన్న యాదవ్, నాగేంద్రరావు, ఓబులేసు యాదవ్ పాల్గొన్నారు.

**బండిఆత్మకూరు:** మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో పేరెంట్స్ మీటింగ్ నిర్వహించారు. కొన్ని పాఠశాలల్లో తరగతి గదుల్లోనే పిల్లలు కూర్చునే టేబుల్లలోనే తల్లిదండ్రులను కూర్చోబెట్టి, రెండు మాటలు చెప్పి పంపారని పలుగ్రామాల్లో తల్లిదండ్రులు బాహాటంగానే చర్చించుకున్నారు. మండల కేంద్రంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో ఎండలో కూర్చున ఓ విద్యార్థి స్పృహ తప్పి పడిపోవటంతో స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. విద్యార్థి కిందపడిపోయిన విషయం వాస్తవమేనని, ఎలాంటి ఇబ్బంది లేదని ఎంఈవో మోహన్‌రెడ్డి తెలిపారు. ఈ వేడుకల్లో ఎంపీపీ దేరెడ్డి చిన్న సంజీవరెడ్డి, జడ్పీటీసీ రామతులశమ్మ, ఎస్ఐ జగన్మోహన్, ప్రిన్సిపాల్ రఫీ, ద్రాక్షాయణి, యాజమాన్య కమిటీ చైర్మన్ రమేష్ మండల అధికారులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


మిడుతూరు మోడల్ స్కూల్‌లో జ్యోతి ప్రజ్వలన చేస్తున్న అధికారులు, ఎస్ఐ తదితరులు


కొత్తపల్లి: గోకవరంలో..

**వెలుగోడు:** మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో పేరెంట్స్ సమావేశాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమాల్లో ఎంఈవో బ్రహ్మం నాయక్, ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ పుల్లయ్య, ఎస్ఎంసీ చైర్‌పర్సన్ సునీత, వైస్ చైర్మన్ మస్తాన్‌వలి పాల్గొన్నారు.

**మహానంది:** మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో శనివారం ఘనంగా తల్లితండ్రులతో ఉపాధ్యాయిల సమావేశం నిర్వహించారు. యు.బొల్లవరంలోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల అభివృద్ధికి కృషి చేసిన టీడీపీ నాయకుడు కిలారు వెంకటేశ్వర్లును ఉపాధ్యాయిలు అభినందించారు. ఉపాధ్యాయిని విమల పాఠశాల అభివృద్ధికి రూ.1.50 లక్షలు విరాళాలు సేకరించడంలో కృషి చేసినందుకు గాను గ్రామస్థులు సన్మానించారు. మహానంది ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాలలో హెచ్‌ఎం అంబమ్మ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. బుక్కాపురంలోని ప్రభుత్వ పాఠశాల ఆవరణలో విద్యార్థుల తల్లులు ముగ్గులు వేశారు. కార్యక్రమాల్లో ఎంఈవో రామసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.


పాములపాడులో స్వాగతం పలుకుతున్న ఉపాధ్యాయులు


జూపాడుబంగ్లా: మండలంలో క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న అతిథులు


ఆత్మకూరు రూరల్: కరివేనలో..


వెలుగోడులో..


మహానంది: యు. బొల్లవరంలో..

## 'మధ్యవర్తిత్వంతో కేసులు పరిష్కారం'

**నందికొట్కూరు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి):** కేసుల పరిష్కారానికి మధ్యవర్తిత్వం చాలా అవరసమని నందికొట్కూరు కోర్టు సివిల్ సీనియర్ న్యాయాధికారి దివాకర్ న్యాయవాదులకు సూచించారు. శనివారం కోర్టు ఆవరణలో న్యాయవాదులతో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వాది, ప్రతివాదుల కేసులను మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కరించుకొనేలా చూడాలని న్యాయవాదులకు సూచించారు. న్యాయవాదులు వెంకటరాముడు, సురేష్, వెంకటేశ్వర్లు, మద్దిలేటి, తదితరులు పాల్గొన్నారు.

### ఉర్దూ పాఠశాల తనిఖీ

పట్టణంలోని విద్యానగర్‌లో ఉర్దూ పాఠశాలను నందికొట్కూరు సీనియర్ సివిల్ న్యాయాధికారి దివాకర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఇటీవల ప్రహరీ కూలి మృతి చెందిన విద్యార్థిని ఘటన గురించి ఆ పాఠశాల ఉపాధ్యాయురాలు షేక్ సబియాను అడిగి తెలుసుకున్నారు.



## 'మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి'

**నంద్యాల క్రైం, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి):** మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని మంత్రి ఫరూక్, ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా సూచించారు. నంద్యాల పట్టణంలోని కేవీఎం మున్సిపల్ హైస్కూల్‌లో జరిగిన సమావేశంలో మంత్రి ఫరూక్, ఎస్పీ అధిరాజ్ సింగ్‌లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. 'డ్రగ్స్ వద్దు బ్రో' అన్న అంశంపైవిద్యార్థులకు అవగాహన కల్పించారు. డ్రగ్స్ వినియోగంతో జరిగే అనర్థాలను వివరించారు. డ్రగ్స్ నిర్మూలన, డ్రగ్స్ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దాలని ఫ్లెక్సీలను ఫరూక్, ఎస్పీలు విడుదల చేశారు.

● మాదకద్రవ్యాల నివారణకు ప్రతిఒక్కరూ పాటుపడాలని నంద్యాల డీఎస్పీ పి.శ్రీనివాసరెడ్డి పిలుపునిచ్చారు. ఎస్పీ ఆదేశాల మేరకు నంద్యాలలోని నూనెపల్లె మున్సిపల్ హైస్కూల్‌లో జరిగిన సమావేశంలో డీఎస్పీ పాల్గొని మాదకద్రవ్యాల వినియోగంవల్ల కలిగే అనర్థాలను విద్యార్థులకు వివరించారు. పోలీస్ అధికారులు, పాఠశాల హెచ్‌ఎం చలపతి తదితరులు పాల్గొన్నారు.

## 'సూర్యఘర్ పథకానికి సబ్సిడీ రుణాలు'

**పాణ్యం, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి):** కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సూర్యఘర్ పథకానికి బ్యాంకుల ద్వారా సబ్సిడీ రుణాలు అందుతాయని నంద్యాల విద్యుత్ శాఖ ఏడీ సుబ్రహ్మణ్యం తెలిపారు. శనివారం ఆయన విద్యుత్ కార్యాలయంలో మాట్లాడుతూ ఇంటిపై భాగాన సోలార్ ఏర్పాటుకు కిలో వాట్‌కు రూ.30 వేలు, రెండు కిలోవాట్‌లకు రూ.60 వేలు, మూడుకిలోవాట్లకు అంతకు పైగా రూ.78 వేల సబ్సిడీ బ్యాంకులద్వారా పొందవచ్చని చెప్పారు. వినియోగదారులు తమ విద్యుత్ బిల్లు, ఆధార్, పాన్‌కార్డు, బ్యాంకు ఖాతా నకలుతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

## 'కుటుంబానికి రక్షణగా తపాలా బీమా'

**జూపాడుబంగ్లా, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి):** తపాలాశాఖలో జీవితబీమా ప్రీమియం చెల్లిస్తే కుటుంబానికి రక్షణగా ఉంటుందని తపాలాశాఖ ఇన్‌స్పెక్టర్ రాఘవేంద్ర, గ్రామ సర్పంచ్ లక్ష్మీదేవమ్మ అన్నారు. మండలంలోని తాటిపాడుగ్రామంలో ఇటీవల వ్యక్తి మృతిచెందడంతో ఆయనకు తపాలా బీమా ఆయన కుటుంబానికి రూ. 1.30లక్షలు బీమా సొమ్మును అందజేశారు. కార్యక్రమంలో పోస్టుమాస్టర్ గోపాలకృష్ణయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఘనంగా కోర్టు వార్షికోత్సవం

**ఆత్మకూరు, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి):** ఆత్మకూరు లోని న్యాయస్థానం ఏర్పాటై 42ఏళ్లు పూర్తయిన సంద ర్భంగా శనివారం న్యాయవాదులు సంబరాలు జరుపు కొన్నారు. ఈ సందర్భంగా సీనియర్ న్యాయవాది కంచర్ల గోవిందరెడ్డి మాట్లాడుతూ ఆత్మకూరు ప్రాంతంలో కోర్టును ఏర్పాటు చేయడం వల్ల న్యాయవాదులకు, కక్షిదారులకు కొంతమేర ఉపయుక్తకరంగా ఉందని తెలిపారు. కార్యక్రమంలో పలువురు న్యాయవాదులు ఉన్నారు.

## 'హామీలను విస్మరించిన ప్రభుత్వాలు'

**నందికొట్కూరు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి):** ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విస్మరించాయని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు నాగేశ్వరరావు ఆరోపించారు. నందికొట్కూరు పట్టణంలో ఈనెల 9వ తేదీన జరగబోయే బహిరంగ సభను జయప్రదం చేసేందుకు శనివారం కొత్తబస్టాండు వద్ద సీపీఎం జీపు జాతాను ఆయన ప్రారభించారు. కార్యక్రమంలో పక్కీర్ సాహెబ్, గోపాలకృష్ణ, నాగన్న, ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

## ఆలయ నిర్మాణానికి భూమి పూజ


భూమిపూజ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి

**జూపాడుబంగ్లా, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి):** మండలంలోని తరిగోపుల మజారా రామ సముద్రం గ్రామంలో శని వారం లక్ష్మీవేంకటేశ్వర స్వామి నూతన దేవాలయ నిర్మాణానికి భూమిపూజ చేశారు. పురోహితులు వేదమంత్రాలతో చేపట్టారు. ఈ కార్యక్రమానికి నందికొట్కూరు మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖరరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై భూమి పూజ చేశారు. టీడీపీ నాయకులు నాగేశ్వరరావు, సుధాకర్‌రెడ్డి, సతీష్‌రెడ్డి, శివానందరెడ్డి, సైఫుద్దీన్, బాలనారాయణగౌడు, వెంకట స్వామి, రమణ, బాలసంజన్న, శ్రీనివాసులు పాల్గొన్నారు.

## '15లోపు ప్రీమియం చెల్లించాలి'

**ఆత్మకూరురూరల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి):** ఆత్మకూరు మండలంలో ఉద్యానవన పంటలను సాగు చేసిన రైతులు బీమా పథకానికి సంబంధించి ప్రీమియం డిసెంబరు 15లోగా చెల్లించాలని మండల ఉద్యానవన శాఖ అధికారి చందన తెలిపారు. మండలంలోని పలు గ్రామాల్లో ఉల్లి పంటలను శనివారం ఆమె పరిశీలించారు. కార్యక్రమంలో ఉద్యావన సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## విద్యుదాఘాతంతో యువకుడికి తీవ్ర గాయాలు

**నందికొట్కూరు రూరల్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి):** మల్యాల గ్రామంలో శనివారం ఓ వ్యక్తి విద్యుదాఘాతంతో తీవ్రంగా గాయపడ్డారు. గ్రామస్థులు తెలిపిన వివరాలివీ.. నందికొట్కూరు మండలంలోని మల్యాల గ్రామానికి చెందిన శివకృష్ణ అనే వ్యక్తి ఉదయం 10 గంటల సమయంలో గ్రామంలో ఒక ఇంటికి విద్యుత్ కనెక్షన్ ఇవ్వడానికి స్తంభం ఎక్కారు. అయితే విద్యుదాఘాతానికి గురై స్తంభంపై నుంచి కింద పడ్డారు. వెంటనే గ్రామస్థులు, కుటంబ సభ్యులు కలిసి హుటాహుటిన నందికొట్కూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడినుంచి మెరుగైన వైద్యం కోసం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు బంధువులు తెలిపారు. మున్సిపల్ కమిషనర్ బేబి మాట్లాడుతూ శివకృష్ణ నందికొట్కూరు మున్సిపల్ పరిధిలోని మల్యాల గ్రామ సమీపంలో ఉన్న పట్టణానికి నీటిని సరఫరాచేసే పంపుహౌస్‌లో అవుట్ సోర్సింగ్ వర్కర్‌గా పనిచేస్తున్నాడని తెలిపారు. శనివారం ఉదయం 7 గంటల కల్లా డ్యూటీ దిగి వెళ్లారని, అయితే గ్రామంలో ఏమీ జరిగిందో పూర్తి విషయాలు తమకు తెలియదని తెలిపారు.

## సుబ్రహ్మణ్య స్వామికి ప్రత్యేక పూజలు


హోమం నిర్వహిస్తున్న అర్చకులు, పాల్గొన్న ఈవో

**శ్రీశైలం, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి):** శ్రీశైలం మహాక్షేత్రంలో శనివారం మార్గశిర శుద్ధ షష్ఠిని పురస్కరించుకుని లోకకళ్యాణార్థం ఆలయ ప్రాంగణంలోని సుబ్రహ్మణ్య (కుమార స్వామి)కి విశేష అభిషేకం, అర్చనలు, హోమం నిర్వహించారు. పూజా కార్యక్రమంలో లోకక్షేమాన్ని కాంక్షిస్తూ అర్చకులు సంకల్పం పఠించారు. అనంతరం పూజా కార్యక్రమం నిర్విఘ్నంగా జరగాలని మహాగణపతిస్వామికి పూజలు చేశారు. అనంతరం సుబ్రహ్మణ్యస్వామికి శాస్త్రోక్తంగా పంచామృతాలతో అభిషేకించి విశేష అలంకరణ, పూజాధికాలు నిర్వహించి మహా మంగళ హారతులు ఇచ్చారు.

ఆంధ్రజ్యోతి
**కంట్రిబ్యూటర్లు కావలెను**

నంద్యాల జిల్లా కేంద్రంలో వార్తల సేకరణకు రిపోర్టర్లు కావలెను. అభ్యర్థి కనీస విద్యార్హత డిగ్రీ. తెలుగు భాషలో చక్కని పరిజ్ఞానం, సంఘటనలను వార్తలుగా మలచగలిగే నైపుణ్యం ఉండాలి. అభ్యర్థులు నంద్యాల ప్రాంత వాసులై ఉండాలి.

❖ నంద్యాల టౌన్ ❖ నంద్యాల కలెక్టరేట్
❖ నంద్యాల హాస్పిటల్ ❖ నంద్యాల ఎడ్యుకేషన్
❖ నంద్యాల నూనెపల్లి

అర్హులైన అభ్యర్థులు 09-12-2024 (సోమవారం) క్రింది అడ్రస్ నందు ఉదయం10 గంటలకు జరిగే రాత పరీక్ష, ఇంటర్వ్యూకు హాజరు కావలెను.

**చిరునామా :**
ఆంధ్రజ్యోతి కార్యాలయం: గుత్తిరోడ్,
నియర్ మాంటిస్సోరి ఇండస్ స్కూల్, కర్నూలు.
సెల్ : 9985411361, 9985411362

# డోన్

డోన్, ఆళ్లగడ్డ, బనగానపల్లె

## దెబ్బతిన్న పంటల పరిశీలన



మల్లేవేములలో దెబ్బతిన్న మినుము పంటను పరిశీలిస్తున్న ఏఈవోలు

**చాగలమర్రి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి):** మండలంలో ఫెంగల్ తుఫాన్ ప్రభావంతో దెబ్బతిన్న వరి, మినుము పంటలను శనివారం ఏవో రంగనేతాజీ పర్యవేక్షణలో ఏఈవోలు మంజుల, ఎంపీఈవో మణి మల్లేవేముల గ్రామంలో పరిశీలించారు. వరి, మినుము, శనగ పంటలను పరిశీలించి నష్టం గురించి రైతులను అడిగి తెలుసుకున్నారు. ఏవో మాట్లాడుతూ 19 గ్రామ పంచాయతీల్లో దెబ్బతిన్న వరి, మినుము పంటలపై వ్యవసాయ సిబ్బందిచే సర్వే చేయించి నష్టాన్ని అంచనా వేశామని అన్నారు. 410 హెక్టార్లలో పంట నష్టం జరిగినట్లు అంచన వేసి పరిహారం కోసం జిల్లా అధికారులకు నివేదికలు పంపించామని అన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది ఉన్నారు.

## ఉపాధి పనులపై విచారణ

**చాగలమర్రి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి):** గ్రామాల్లో ఉపాధి పనులపై సామాజిక తనిఖీ విచారణ చేపట్టినట్లు ఎంపీడీవో రాజేంద్రప్రసాద్, ఏపీవో నిర్మల తెలిపారు. శనివారం సామాజిక తనిఖీ ఎస్ఆర్‌పీ, డీఆర్‌పీ, టీఏ, ఎఫ్ఏలచే సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 19 గ్రామ పంచాయతీల్లో 2023-24 సంవత్సరంలో చేసిన ఉపాధి పనులపై విచారణ చేయడం జరుగుతుందని అన్నారు. రూ.8.70 కోట్ల పనులపై సామాజిక తనిఖీ సభ్యులు విచారణ చేస్తారని అన్నారు. గ్రామాల్లో విచారణ పూర్తి చేసి మండలస్థాయిలో బహిరంగ విచారణ సభ నిర్వహిస్తామని అన్నారు.

## కేంద్రీయ విశ్వవిద్యాలయ మంజూరుపై హర్షం

**రుద్రవరం, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) :** కేంద్రప్రభుత్వం కేంద్రీయ విశ్వవిద్యాలయాన్ని మంజూరు చేయడం హర్షణీయమని శనివారం ఎంపీటీసీ భగవాన్ అన్నారు. నంద్యాల జిల్లా డోన్ పట్టణానికి కేంద్రీయ విశ్వవిద్యాలయం మంజూరైందన్నారు. సీపీఎస్ సిలబస్ బోధిస్తారని ఆయన అన్నారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల పిల్లలకు 50శాతం, రాష్ట్రప్రభుత్వ ఉద్యోగుల పిల్లలకు 25శాతం ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ ఆర్థికంగా వెనుకబడ్డ వారిపిల్లలకు మరో 25శాతం సీట్లు కేటాయిస్తారని అన్నారు. ఈ విద్యాలయంతో 960 మంది పిల్లలకు విద్య అవకాశం అందుతుందన్నారు. 63 ఉద్యోగాలు పొందుతారన్నారు. ప్రధాని మోదీ, ఏపీ సీయం చంద్రబాబులకు కృతజ్ఞతలు తెలిపారు.

## సీపీఎం మండల కార్యదర్శిగా నాగరాజు

**డోన్ రూరల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి):** సీపీఎం మండల కార్యదర్శిగా కోయలకొండ నాగరాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఇటీవల నిర్వహించిన మండలం సీపీఎం మూడో మహాసభలో కమిటీలను ఎన్నుకున్నారు. ఇందులో భాగంగా సీపీఎం మండల కార్యదర్శిగా కోయలకొండ నాగరాజును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారనీ ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఏ.నాగరాజు తెలిపారు. శనివారం డోన్ సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు.

## ఘనంగా నాగదేవత విగ్రహాల ప్రతిష్ఠ



పాత శివాలయంలో నాగదేవతలకు పూజలు చేస్తున్న మహిళలు

**చాగలమర్రి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి):** చాగలమర్రి గ్రామంలోని పాత శివాలయంలో సంతాన నాగేంద్రస్వామి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం సందర్భంగా వేద పండితుల ఆధ్వర్యంలో శనివారం నాగదేవత విగ్రహాల ప్రతిష్ఠ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఉభయదారులచే క్షీరాభిషేకం, గణపతి, నవగ్రహ, అమ్మవారికి పూజలు చేశారు. విగ్రహాలకు జల, పాలాభిషేకాలు నిర్వహించారు. మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, కమిటీ సభ్యులు సల్లానాగరాజు, గుత్తి నరసింహులు, మహిళలు పాల్గొన్నారు.

## ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి



పోస్టర్లను విడుదల చేస్తున్న నాయకులు, ఆశా వర్కర్లు

**కొలిమిగుండ్ల , డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి):** ఆశావర్కర్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి శివబాలకృష్ణ డిమాండ్ చేశారు. శనివారం కొలిమిగుండ్లలో ఆయన మాట్లాడుతూ 10న కలెక్టరేట్ ఎదుట జరిగే ధర్నాను విజయవంతం చేయాలని కోరారు. ఏపీలో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని కోరారు. క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న ఆశావర్కర్లను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తున్నాయన్నారు. కార్యక్రమంలో సీపీఐ మండల కన్వీనర్ సూర్యనరాయణ, మహేశ్, బాలసంజీవులు, ఆశాకార్యకర్తలు లక్ష్మీదేవి, ప్రమీల, బయమ్మ, శోభ, తుంగమ్మ, లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

## 'ఆధిపత్య పోరుతో నిరాధార ఆరోపణలు'

**ఆళ్లగడ్డ(శిరివెళ్ల), డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి) :** అహోబిలం క్షేత్రంలో అర్చకుల మధ్య నెలకొన్న ఆధిపత్యపోరుతో నిరాధారమైన ఆరోపణలు చేయిస్తున్నారని టీడీపీ జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు గూడూరు సంజీవరాయుడు, తెలుగు యువత ఉపాధ్యక్షుడు సానే అంజి అన్నారు. ఆళ్లగడ్డ పట్టణంలోని ఎమ్మెల్యే కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ లడ్డూ ప్రసాదాల తయారీకి వినియోగించే సరుకులకు కమీషన్లు ఇవ్వాలని తాము ఒత్తిడి చేస్తున్నట్లు ఓ పత్రికలో(ఆంధ్రజ్యోతి కాదు) వచ్చిన వార్తను వారు ఖండించారు. అహోబిల దేవస్థాన పరిపాలన దేవదాయశాఖ నుంచి మఠం చేతుల్లోకి వెళ్లినప్పటి నుంచి సమస్యలు తలెత్తుతున్నాయని అన్నారు. అలాగే ఇటీవల బాధ్యతలు చేపట్టిన సీఏవో పర్యవేక్షణ లోపంతోనే లడ్డూ ప్రసాదాల తయారీలో లోపాలు ఏర్పడ్డాయని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు వీరభద్రుడు, నరేష్, ప్రసాద్, ఎస్ఎల్ రమణ పాల్గొన్నారు.

## వ్యక్తి అరెస్టు

**కోవెలకుంట్ల, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) :** పట్టణంలోని ఆర్టీసీ బస్టాండు వద్ద ఓ వ్యక్తిని అరెస్టు చేసి అతడి వద్ద నుంచి 30 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు కోవెలకుంట్ల ఎస్ఐ మల్లిఖార్జునరెడ్డి శనివారం తెలిపారు. దొర్నిపాడు మండలం క్రిష్టిపాడు గ్రామానికి చెందిన ఖాదర్‌బాషా అనే వ్యక్తి కోవెలకుంట్లకు వచ్చి ఓ మద్యం షాపు వద్ద 30 మద్యంబాటిళ్లు కొనుగోలు చేశారు. వాటిని విక్రయించేందుకు క్రిష్టిపాడు గ్రామానికి తీసుకెళ్తుండగా బస్టాండు వద్ద అతన్ని అదుపులోకి తీసుకొని 30 బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## తిమ్మనాయునిపేటలో వరుస దొంగతనాలు

**కొలిమిగుండ్ల, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) :** మండలంలోని తిమ్మనాయునిపేట గ్రామంలో వరుస దొంగతనాలు జరుగుతుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. గత రెండు రోజుల వ్యవధిలోనే గ్రామానికి చెందిన సుమారు పది మంది రైతుల పంట పొలాల్లో బోరు బావుల వద్ద ఉన్న కేబుల్(కాపర్) వైరు చోరీకి గురైనట్లు శనివారం రైతులు గురునాగయ్య, ఆకుల వలి, నడిపి గూడువలి, నందిపాటి ఆజీవల్యం, రాఘవేంద్ర, ప్రభుదాస్ ఆవేదన వ్యక్తం చేశారు. 15మోటార్ల వద్ద విద్యుత్ సరఫరా అయ్యో కాపర్ వైరు దొంగలు ఎత్తుకెళ్లారు.



డోన్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాశ్ రెడ్డి



ఆళ్లగడ్డలో నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ



డోన్ పాతపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న సుబ్బారెడ్డి

# చదువుతోనే ఉజ్వల భవిష్యత్తు

- ఘనంగా మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశాలు

**డోన్ రూరల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి):** చదువుతోనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి అన్నారు. శనివారం మెగా టీచర్స్, పేరెంట్స్ ఆత్మీయ సమావేశం ఘనంగా జరిగింది. పట్టణంలోని నెహ్రూనగర్ ఉన్నత పాఠశాల, జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో జరిగిన పేరెంట్స్ ఆత్మీయ సమావేశానికి ఎమ్మెల్యే కోట్ల ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు ఘనస్వాగతం పలికారు. ఆయా పాఠశాలల్లో విద్యార్థుల సమస్యలను ఎమ్మెల్యే అడిగి తెలుసుకున్నారు. పాఠశాలల్లో విద్యార్థుల సమస్యలు ఏమైనా ఉంటే తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తామన్నారు. విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. చదువుతో పాటు క్రమశిక్షణతో మెలగాలన్నారు. గురువులకు, తల్లిదండ్రులకు, సమాజానికి మంచి పేరు తీసుకురావాలన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లల చదువులపట్ల శ్రద్ధ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శులు వలసల రామకృష్ణ, కోట్రికే ఫణిరాజ్, పట్టణ ఎస్ఐ శరత్ కుమార్ రెడ్డి, తదితరులు ఉన్నారు.

### పిల్లల ప్రవర్తనను తల్లిదండ్రులు గమనించాలి

**ఆళ్లగడ్డ(శిరివెళ్ల):** పిల్లల ప్రవర్తనను తల్లిదండ్రులు తరచూ గమనిస్తూ ఉండాలని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ అన్నారు. ఆళ్లగడ్డ పట్టణంలోని గర్ల్స్ హైస్కూల్‌లో శనివారం నిర్వహించిన మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సెల్‌ఫోన్ ప్రభావంతో బాల బాలికలు తమ లక్ష్యాలను చేరుకోవడంలో విఫలమవుతున్నారని అన్నారు. విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ క్రమశిక్షణతో మెలిగితే ఉజ్వల భవిష్యత్తు కలుగుతుందని అన్నారు. విద్యార్థులు నిర్వహించిన పలు కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. చిన్నారులు, మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలపై విద్యార్థినులు నిర్వహించిన ప్రదర్శనను చూసి ఎమ్మెల్యే కంటతడి పెట్టారు. అనంతరం ప్రాణాలు కోల్పోయిన వారికి విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలిసి ఎమ్మెల్యే నివాళి అర్పించారు.

### బాలికల సంరక్షణ తల్లిదండ్రులదే బాధ్యత

**చాగలమర్రి:** బాలికల సంరక్షణ తల్లిదండ్రులదే బాధ్యతని ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ అన్నారు. శనివారం చాగలమర్రి కస్తూర్బా పాఠశాలలో ఏర్పాటు చేసిన మెగా ఆత్మీయ సమావేశంలో పాల్గొన్నారు. జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ పిల్లల పట్ల తల్లిదండ్రులు జాగ్రత్తగా ఉండాలని, మంచి విద్యాబుద్ధులు నేర్పించేందుకు కృషి చేయాలని అన్నారు. అనంతరం బాలికలకు ప్రోగ్రెస్ కార్డులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఈవో అనూరాధ, ఎస్ఐ రమేష్‌రెడ్డి, ఎస్‌వో సునిత, రాష్ట్ర మైనార్టీసెల్ ఉపాధ్యక్షుడు అన్సర్‌బాషా, బీసీసెల్ నంద్యాల స్పోక్‌పర్సన్ సల్లానాగరాజు, నంద్యాల మైనార్టీసెల్ నాయకుడు కొలిమి ఉసేన్‌వలి, టీడీపీ నాయకులు మౌలాలి, జెట్టి నాగరాజు, అనిఫ్, పుల్లయ్య, మాబులాల్, గఫార్, జల్సాగౌస్, రాజేంద్ర, బషీర్, ఉపాధ్యాయినీలు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

- మండలంలోని 46 పాఠశాలల్లో శనివారం మెగా ఆత్మీయ సమావేశాన్ని పాఠశాలల చైర్మన్‌లు, హెచ్ఎంల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. బాలుర ఉన్నత పాఠశాలలో ఎంపీడీవో రాజేంద్రప్రసాద్, బాలికల పాఠశాలలో తహసీల్దార్ రవికుమార్, చింతలచెరువు పాఠశాలలో ఎంఈవో న్యామతుల్ల పర్యవేక్షణలో వేడుకలు నిర్వహించారు. చింతలచెరువు పాఠశాలలో తల్లిదండ్రులకు వివిధ పోటీలు నిర్వహించి బహుమతులను అందజేశారు.

**ఉయ్యాలవాడ:** మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలో మెగా పేరెంట్స్, టీచర్ల సమావేశం పండుగలా సాగింది. విద్యార్థుల తల్లిదండ్రులకు వివిధ రకాల ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. ఉయ్యాలవాడలోని ఆదర్శ పాఠశాలలో తహసీల్దారు శ్రీనివాసులు, ఎంపీడీవో ఉమమహేశ్వరరావు పాల్గొన్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రుల మధ్య సమన్వయం కల్పించటం కోసమే ఈ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు ఎంఈవో ప్రతాప్‌రెడ్డి తెలిపారు. మాయలూరు, ఉయ్యాలవాడ, కొండుపల్లె, హరివరం గ్రామ ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు షరీఫ్, వెంకటేశ్వర్లు, నరసింహుందు, రామోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

**బనగానపల్లె:** తల్లిదండ్రులు పిల్లలకు చిన్నతనం నుంచే కష్టం విలువ తెలిసే విధంగా పెంచాలని బనగానపల్లె పట్టణ మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి సూచించారు. శనివారం బనగానపల్లె పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నతపాఠశాలలో మెగా పేరెంట్స్ అండ్ టీచర్స్ సమావేశం హెడ్మాస్టర్ గంగాధర్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథిగా బీసీ రాజారెడ్డి హాజరై మాట్లాడుతూ విద్యాశాఖామంత్రి నారాలోకేశ్ విద్యావ్యవస్థలో మార్పులు తీసుకురావడానికి నూతన ఒరవడికి నాంది పలికారని కొనియాడారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు క్రమశిక్షణ, మంచి విద్యాబుద్ధులు నేర్పించాలన్నారు. పాఠశాలలోని పేద విద్యార్థులకు రూ.10వేలు ఆర్థిక సాయం బీసీ రాజారెడ్డి అందించారు. కార్యక్రమంలో ప్రపంచ ఆర్య వైశ్యమహాసభ జిల్లా అధ్యక్షుడు టంగుటూరు శ్రీనయ్య, ఉపాధ్యాయులు శ్రీనివాసరెడ్డి, శ్రీగౌరి, లలితమ్మ, శివనాగేశ్వరరావు, తదతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**దొర్నిపాడు:** విద్యతో పాటు అన్ని రంగాల్లో ముందుండాలని మండల ప్రత్యేక అధికారి గోవిందనాయక్, తహసీల్దార్ సుభద్ర, ఎంపీడీవో సావిత్రి అన్నారు. శనివారం ప్రభుత్వ ఆదేశాల మేరకు మండలంలోని ఆయా గ్రామాల్లోని పాఠశాలల్లో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈవో మనోహర్‌రెడ్డి, ఎస్ఐ వెంకటేష్, ఏవో ప్రమీల, ఎస్ఆర్ఈజీఎస్ ఏపీవో గంగన్న, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, మండల టీడీపీ నాయకులు సిద్ధి సత్యం, బబ్బూరి వెంకటస్వామి, దయానందరావు, బబ్బూరి కృష్ణ, కొత్తపల్లి సురేంద్ర, తాళ్లూరి రమేష్‌నాయుడు, వెంకట్‌నాయుడు, నిమ్మకాయల వెంకట్రామిరెడ్డి, ఎంపీటీసీ మహబూబ్ బాష, కట్టుబడి బాష, టీడీపీ మైనార్టీ నాయకుడు చాంద్‌బాష, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

**కొలిమిగుండ్ల:** విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలంటే పూర్తి బాధ్యత తల్లిదండ్రులదేనని బనగానపల్లె నియోజకవర్గం టీడీపీ సమన్వయ కర్త వీఆర్ లక్ష్మిరెడ్డి అన్నారు. శనివారం కనకాద్రిపల్లె గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో జరిగిన తల్లిదండ్రులు, టీచర్స్ సమావేశంలో వీఆర్ లక్ష్మిరెడ్డి, వెంకటమల్లారెడ్డి, సర్పంచ్ శివశంకర్, ఉపసర్పచర్ రామలక్ష్మన్న, ఎస్సీ పెద్దిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. కొలిమిగుండ్ల జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలలో హెచ్ఎం హుసేనయ్య, ఎస్సీ పాఠశాలలో హెచ్ఎం సుంకన్న, ఇతర గ్రామాల్లో ఆయా హెచ్ఎంలు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. మండల విద్యాధికారితో పాటు సర్పంచ్ శివ, ఆయా పాఠశాలలకు చెందిన హెచ్ఎంలు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

**శిరివెళ్ల:** విద్యార్థులకు మెరుగైన విద్య అందించడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని టీడీపీ మండల కన్వీనర్ కాటంరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ యామా గుర్రప్ప అన్నారు. మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహించిన మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశానికి వారు శనివారం ముఖ్య అతిథిలుగా హాజరయ్యారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. కార్యక్రమాల్లో ఎంఈవోలు డీటీ శంకర్ ప్రసాద్, నాగార్జునరెడ్డి, టీడీపీ నాయకులు తిరుమల రవి, సగ్గెల నాగలింగమయ్య, కొండబోయిన బాలచంద్రుడు తదితరులు పాల్గొన్నారు.

**అవుకు:** పేరెంట్స్ అండ్ టీచర్స్ ఆత్మీయ సమావేశంతో విద్యార్థుల్లో చైతన్యం వస్తుందని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి చల్లా విజయభాస్కర్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో పేరెంట్స్ కార్యక్రమాన్ని నిర్వహించారు. అవుకు ఏపీ మోడల్‌స్కూల్‌లో నిర్వహించిన పేరెంట్స్ అండ్ టీచర్స్ సమావేశానికి చల్లా విజయభాస్కర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం చల్లా విజయభాస్కర్‌రెడ్డిని ఉపాధ్యాయ బృందం సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ హెమీమా, ఉపాధ్యాయులు , విద్యార్థులు పాల్గొన్నారు.

- మండలంలోని సంగపట్నం పాఠశాలలో నిర్వహించిన పేరెంట్స్ అండ్ టీచర్స్ కార్యక్రమానికి టీడీపీ అవుకు మండల అధ్యక్షుడు ఐ.ఉగ్రసేనారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. అనంతరం ఐ.ఉగ్రసేనారెడ్డిని ఉపాధ్యాయ బృందం సన్మానించారు.

**ప్యాపిలి:** పాఠశాలల్లో పిల్లల తల్లిదండ్రుల సహకారంతోనే విద్యాభివృద్ధి సాధ్యమవుతుందని జిల్లా విద్యాధికారి జనార్ధన్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని రాచెర్ల, జలదుర్గం ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో నిర్వహించిన ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. డీఈవో మాట్లాడుతూ విద్యార్థుల చదువుపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. అలాగే ఉపాధ్యాయులు కూడా పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు మెరుగు పరచాలని సూచించారు.

**డోన్ రూరల్:** విద్యార్థుల పట్ల ఉపాధ్యాయులతో పాటు తల్లిదండ్రులు బాధ్యత తీసుకోవాలని రాష్ట్ర సీడ్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ధర్మవరం సుబ్బారెడ్డి సూచించారు. పట్టణంలోని జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల, బాలికల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, గురుకుల పాఠశాలల్లో జరిగిన మెగా టీచర్స్, పేరెంట్స్ సమావేశానికి ఆయన హాజరయ్యారు. ఆయా కార్యక్రమాల్లో మున్సిపల్ వైస్ చైర్మన్ కోట్రికే హరికిషణ్, ఎంపీపీ రేగటి రాజశేఖర్ రెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కోట్రికే ఫణిరాజ్, మున్సిపల్ కమిషనర్ ప్రసాద్‌గౌడు పాల్గొన్నారు.

**కోవెలకుంట్ల:** ప్రతి విద్యార్థిని క్రమశిక్షణ, పట్టుదలతో చదివినప్పుడే ఉన్నత శిఖరాలు చేరుకుంటారని సీఐ హనుమంతనాయక్ అన్నారు. శనివారం పట్టణంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో మెగా పేరెంట్స్ అండ్ టీచర్స్‌మ్కూలులో వైస్‌ప్రిన్సిపాల్ సునీత ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్ఐ మల్లిఖార్జునరెడ్డి, తహసీల్దారు పవన్‌కుమార్‌రెడ్డి, టీడీపీ నాయకులు శేఖర్, సుధాకర్, శేషు, ఉపాధ్యాయినీలు విద్యార్థులు పాల్గొన్నారు.

- విద్యార్థులు ఉపాధ్యాయులను భగవంతుడితో సమానంగా చూడాలని రాష్ట్ర టీడీపీ కార్యదర్శి గడ్డం రామక్రిష్ణరెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో మెగా పేరెంట్స్ అండ్ టీచర్స్ సమావేశం హెచ్ఎం అరుణకుమారి ఆధ్వర్యంలో నిర్వహించారు.

**కోవెలకుంట్ల :** పేద విద్యార్థుల అభ్యున్నతే తన ధ్యేయమని టీడీపీ నాయకులు ధనంజయుడు అన్నారు. శనివారం వెలగటూరులోని ప్రభుత్వ పాఠశాలలో మెగా పేరెంట్స్ సమావేశం నిర్వహించారు. సమావేశంలో టీడీపీ నాయకులు ధనుంజయుడు పాల్గొని విద్యార్థులకు సొంత నిధులతో ప్లేట్లు, గ్లాసులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో తిమ్మరాజు పాల్గొన్నారు.

**రుద్రవరం:** విద్యార్థులు క్రమశిక్షణతో చదవాలని టీడీపీ మండల కన్వీనరు ఎల్‌వీ రంగనాయకులు, ప్రిన్సిపాల్ నాగేశ్వర్‌రావు అన్నారు. శనివారం మండలంలోని అన్ని పాఠశాలలో మెగా టీచర్స్, పేరెంట్స్ సమావేశం నిర్వహించారు. ఆదర్శపాఠశాలలో వారు విద్యార్థులకు బహుమతులు పంపిణీ చేశారు. అలాగే కస్తూర్బాగాంధీ గురుకుల విద్యాలయంలో జిల్లా ఉద్యానశాఖాధికారి నాగరాజు, ప్రిన్సిపాల్ లక్ష్మీదేవి మొక్కలు నాటి నీరు పోశారు.

**సంజామల:** పిల్లల ప్రవర్తనపట్ల తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని టీడీపీ సీనియర్ నాయకుడు బెలుం సురేష్ రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని అన్ని ఉన్నత పాఠశాలలో మెగా పేరెంట్స్, టీచర్స్ డేని ఘనంగా నిర్వహించారు. పేరుసోమల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థులను ఆహ్వానించి వారి అనుభవాలను ప్రస్తుతం చదువుతున్న విద్యార్థులకు తెలిపారు. శాంతిరామ్ వైద్యశాలలో న్యూరాలజిస్టుగా పని చేస్తున్న డాక్టర్ శివరామిరెడ్డి పాఠశాలకు రూ. లక్ష అందజేశారు. సంజామల కస్తూర్బా గాంధీ విద్యాలయంలో పేరెంట్స్ కం టీచర్స్ డే ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో సాల్మన్, ఎస్.ఐ రమణయ్య, ప్రిన్సిపాల్ శ్రీలేఖ, హెచ్.ఎం సీతారావమ్మ, సీనియర్ సైన్స్ ఉపాధ్యాయుడు మేడా హరిప్రసాద్, శంకర్ రెడ్డి, చిన్న శేఖర్ రెడ్డి, నాగిరెడ్డి, మహేష్ బాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ప్యాపిలి: రాచెర్ల హైస్కూలులో మాట్లాడుతున్న డీఈవో



అవుకులో చల్లా విజయభాస్కర్‌రెడ్డిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు



విజేతలను సన్మానిస్తున్న ప్రిన్సిపాల్, ఎంపీడీవో, ఎస్ఐ



మాట్లాడుతున్న సీఐ హనుమంతనాయక్



చింతలచెరువులో తాడు లాగు పోటీల్లో పాల్గొన్న తల్లిదండ్రులు



కనకాద్రిపల్లెలో మాట్లాడుతున్న టీడీపీ నాయకుడు వీఆర్ లక్ష్మీరెడ్డి



హరివరం ఉన్నత పాఠశాలలో తల్లిదండ్రులకు బహుమతులు అందిస్తున్న పాఠశాల ప్రధానోపాధ్యాయుడు



బనగానపల్లెలో మాట్లాడుతున్న బీసీ రాజారెడ్డి



రుద్రవరంలో బహుమతుల పంపిణీ



చాగలమర్రిలోని ఎస్టీ కాలనీ పాఠశాలలో..



దొర్నిపాడు: చాకరాజువేములలో బహుమతుల పంపిణీ

## మతోన్మాదులపై చర్యలు తీసుకోవాలి



ఆళ్లగడ్డలో ఫిర్యాదు చేస్తున్న అఖిలపక్ష నాయకులు

**ఆళ్లగడ్డ (శిరివెళ్ల), డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి) :** హిందూ, ముస్లింల మధ్య చిచ్చు రేపి శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని జాయింట్ యాక్షన్ కమిటీ కన్వీనర్ బీరువాల బాషా, అఖిలపక్ష నాయకులు డిమాండ్ చేశారు. అఘోరీనని చెప్పుకుంటూ తిరుగుతున్న ట్రాన్స్‌జెండర్ చేస్తున్న విద్వేషపూరిత ప్రసంగాలపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ పట్టణ పోలీస్ స్టేషన్‌లో శనివారం రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. దేశ ఔన్నత్యాన్ని దెబ్బతీసేలా వ్యవహరిస్తున్న ట్రాన్స్‌జెండర్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త బరగొడ్ల హుసేన్ బాషా, మాలమహానాడు ఇమ్మానియేల్ వర్గం నాయకులు సుధాకర్ పాల్గొన్నారు.

## వంద హెక్టార్లలో పంట నష్టం అంచనా

**ఉయ్యాలవాడ, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి):** ఇటీవల కురిసిన వర్షాలకు ఆయా గ్రామాల్లో వంద హెక్టార్లలో పంట నష్టం జరిగినట్లు అంచనా వేశామని మండల వ్యవసాయ అధికారి సుధాకర్‌రెడ్డి శనివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యంగా కోత దశలో ఉన్న వరి పంట పూర్తిగా దెబ్బ తినిందన్నారు. వీటిని క్షేత్ర స్థాయిలో గుర్తించి తుది జాబితా తయారు చేస్తామని ఆయన తెలిపారు.

## షాదీఖానాకు రూ.50 లక్షల నిధులు మంజూరు

**కోవెలకుంట్ల, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) :** కోవెలకుంట్ల పట్టణంలో షాదీఖానా నిర్మాణానికి రూ.50 లక్షలు నిధులు మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి మంజూరు చేయించడం హర్షించదగ్గ విషయమని ముస్లిం నాయకులు మాజీ ఉమ్మడి కర్నూలు జిల్లాజిల్లా పరిషత్ కోఆప్షన్‌మెంబరు ఎస్ఏ గఫూర్ అన్నారు. శనివారం కోవెలకుంట్లలో ఆయన మాట్లాడుతూ గత ఎన్నికల్లో ముస్లింలకు షాదీఖానా అన్ని హంగులతో నిర్మిస్తానని బీసీ జనార్ధనరెడ్డి హామీ ఇచ్చారని, గెలిచిన వెంటనే నిధులు మంజూరు చేయడం అభినందనీయమన్నారు.

## మద్దిలేటి స్వామిని దర్శించుకున్న కలెక్టర్



కలెక్టర్‌కు స్వామివారి చిత్రపటాన్ని అందజేస్తున్న ఈవో

**బేతంచెర్ల, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి):** మండలంలోని ఆర్ఎస్ రంగాపురం గ్రామ శివారులో వెలసిన ప్రముఖ క్షేత్రమైన మద్దిలేటి నరసింహ స్వామి, మహాలక్ష్మి అమ్మవార్లను కలెక్టర్ రాజకుమారి శనివారం దర్శించుకున్నారు. కలెక్టర్‌కు ఈవో రామాంజనేయులు ఆధ్వర్యంలో వేదపండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. స్వామి, అమ్మవార్లకు ఆమె ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం శేషవస్త్రాలతో సన్మానించి స్వామి వారి చిత్రపటాన్ని, తీర్థప్రసాదాలను అందజేశారు. కలెక్టర్ వెంట మండల కన్వీనర్, ఆలయ మాజీ చైర్మన్ ఎల్ల నాగయ్య ఉన్నారు.

## తూకాల్లో మోసాలు అరికట్టండి

**డోన్ రూరల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి):** మండలంలోని పలు గ్రామాల్లో రేషన్ డీలర్లు తూకాల్లో మోసాలకు పాల్పడుతున్నారని సీపీఐ పట్టణ, మండల కార్యదర్శులు నారాయణ, మోటరాముడు ఆరోపించారు. డోన్ తహసీల్దార్ నాగమణిని కలిసి శనివారం వినతి పత్రం అందజేశారు.

## మహిళలకు ముగ్గుల పోటీలు



ముగ్గులు వేస్తున్న మహిళలు

**రుద్రవరం, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) :** రుద్రవరం కస్తూర్బాగాంధీ విద్యాలయంలో మహిళలకు శనివారం ముగ్గుల పోటీ నిర్వహించారు. గ్రామాల నుంచి తరలివచ్చిన మహిళలు రంగురంగుల ముగ్గులను వేశారు. ముగ్గులను జిల్లా ఉద్యానశాఖాధికారి నాగరాజు, ప్రిన్సిపాల్ లక్ష్మీదేవి పరిశీలించారు. అనంతరం పోటీల్లో గెలిచిన విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.